సమగ్ర సమాచార పత్రిక
www.mudranews.in

# ముద్ర

హైదరాబాద్
ఆదివారం, 02.08.2026
www.mudranews.in | @mudranews
సంపుటి:13 సంచిక: 271
పేజీలు: 08 వెల: రూ. 5

# క్రిమినల్ వేస్ట్ వ్యాఖ్యలతో కలకలం

## సీఎం రేవంత్ వ్యాఖ్యలపై మండిపడ్డ జెన్ జీ, ప్రతిపక్షాలు

- యువతను అవమానించారంటూ బీఆర్ఎస్, బీజేపీ విమర్శలు
- 'క్రిమినల్ వేస్ట్' ట్రెండ్‌గా మారిందా?
- రేవంత్ మాటలతో తెలంగాణలో దుమారం
- విద్యా వ్యాఖ్యలు.. రాజకీయ తుఫాను



**ముద్ర, హైదరాబాద్:** తెలంగాణ ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి చేసిన 'క్రిమినల్ వేస్ట్' వ్యాఖ్యలు రాష్ట్ర రాజకీయాల్లో తీవ్ర దుమారం రేపుతున్నాయి. ఇంజినీరింగ్ విద్యార్థుల ఉద్యోగార్హతలు, నైపుణ్యాల లోపంపై మాట్లాడిన సందర్భంగా సీఎం చేసిన వ్యాఖ్యలను ప్రతిపక్షాలు తీవ్రంగా తప్పుబడుతున్నాయి. కాంగ్రెస్ మాత్రం ఆయన ఉద్దేశం విద్యార్థులను కించపరచడం కాదని, ప్రస్తుత విద్యా వ్యవస్థలో ఉన్న లోపాలను ఎత్తిచూపడమేనని సమర్థిస్తోంది.
రాష్ట్రంలో ప్రతి ఏడాది సుమారు 1.10 లక్షల మంది ఇంజినీరింగ్ పట్టభద్రులు బయటకు వస్తున్నప్పటికీ, వారిలో చాలామంది కనీస ఉద్యోగ దరఖాస్తును కూడా స్వయంగా నింపలేని పరిస్థితి ఉందని, ఇది విద్యా వ్యవస్థలోని "క్రిమినల్ వేస్ట్" అని సీఎం వ్యాఖ్యానించారు. అయితే ఈ వ్యాఖ్యలు సోషల్ మీడియాతో పాటు రాజకీయ వర్గాల్లో తీవ్ర చర్చకు దారితీశాయి.

**క్షమాపణ చెప్పాలని డిమాండ్**

ముఖ్యమంత్రి వ్యాఖ్యలపై ప్రధాన ప్రతిపక్షమైన బీఆర్ఎస్‌తో పాటు బీజేపీ నేతలు తీవ్రస్థాయిలో స్పందించారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రులు హరీష్‌రావు, జగదీశ్ రెడ్డి తదితరులు సీఎం వెంటనే విద్యార్థులు, ఉపాధ్యాయులకు బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. యువత ఆత్మగౌరవాన్ని దెబ్బతీసేలా వ్యాఖ్యలు చేశారని ఆరోపించిన కేటీఆర్, "జెన్-జీ యువత ఈ వ్యాఖ్యలకు గట్టిగా స్పందించాలి" అంటూ పిలుపునిచ్చారు. బీజేపీ నేత ఈటల రాజేందర్ కూడా విద్యార్థులను అవమానించేలా వ్యాఖ్యలు చేయడం సరైంది కాదని విమర్శించారు.

**'క్రిమినల్ వేస్ట్' ట్రెండ్**

సీఎం వ్యాఖ్యల తర్వాత సోషల్ మీడియాలో #CriminalWaste, #WeAreNotCriminalWaste, #GenZ వంటి మిగతా 02లో



## ఒక్కరోజులోనే రెండు లక్షలు దాటిన మీ-సేవ లావాదేవీలు

మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు

- తొలిసారి రికార్డు స్థాయిలో కార్యకలాపాలు
- దేశంలోనే నెంబర్ వన్ గా మీసేవ ఆన్లైన్ ప్లాట్ ఫాం

03

## యువత శక్తికి మోడీ దిగొచ్చారు

బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్



- వాట్సాప్ అంకుల్స్ vs ఇన్‌స్టాగ్రామ్ కిడ్స్ పోరాటమన్న కేటీఆర్
- జెన్ జీ ఉద్యమం దేశ రాజకీయాలను కదిలించింది
- సోషల్ మీడియానే మార్పుకు కారణమం
- మీడియా కంటే యువతే నెరేటివ్ మార్చింది

03

# రైతులకు గుడ్‌న్యూస్?

## ఎస్సారెస్పీపై ఉత్తమ్ కీలక ప్రకటన



- ప్రాజెక్ట్‌ను పరిశీలించిన మంత్రి
- పూడికతీతకు ప్రత్యేక ప్రణాళికలు సిద్ధం
- మేడిగడ్డ, అన్నారం, సుందిళ్లపై బీఆర్ఎస్‌పై విమర్శలు
- సాగునీటి విడుదలపై త్వరలోనే స్పష్టత

**ముద్ర న్యూస్ నెట్ వర్క్ :** తెలంగాణ నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి నిజామాబాద్ జిల్లాలోని శ్రీరాంసాగర్ (ఎస్సారెస్పీ) ప్రాజెక్టును సందర్శించి, గోదావరి పరివాహక ప్రాంతాల్లోని ప్రాజెక్టుల పరిస్థితులను సమీక్షించారు. ఎస్సారెస్పీ ప్రాజెక్ట్ తెలంగాణ రాష్ట్రానికే గర్వకారణమని, సుమారు 56 ఏళ్ల చరిత్ర కలిగిన ఈ ప్రాజెక్ట్ ఆయకట్టు రైతులకు జీవనాడిగా నిలిచిందని ఆయన పేర్కొన్నారు.

**ఎస్సారెస్పీ నీటి విడుదలపై స్పష్టత**

ఎస్సారెస్పీ ప్రాజెక్ట్‌లో పూడిక వల్ల నీటి నిల్వ సామర్థ్యం తగ్గుతుండడాన్ని గుర్తించి, ప్రాజెక్ట్ పూడికతీతకు సంబంధించి ప్రత్యేక ప్రణాళికలను సిద్ధం చేస్తున్నట్లు మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. రాబోయే రెండు రోజుల్లో ప్రాజెక్ట్ నుండి సాగునీటి విడుదలపై స్పష్టమైన ప్రకటన చేస్తామన్నారు. అయితే, గత సంవత్సరంతో పోలిస్తే ప్రస్తుతం ప్రాజెక్ట్‌లో నీటి నిల్వలు కొంత తక్కువగా ఉన్నాయని, ఈ పరిస్థితిని రైతులు గమనించి సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

**బీఆర్ఎస్ తప్పుడు ప్రచారం**

మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీలలో నీరు నింపకపోవడంపై బీఆర్ఎస్ పార్టీ కావాలనే తప్పుడు ప్రచారం చేస్తోందని మంత్రి మండిపడ్డారు. సాంకేతిక లోపాలు, డిజైన్ వైఫల్యాల వల్ల దెబ్బతిన్న ఈ మూడు ప్రాజెక్టుల మిగతా 02లో

## ఖమ్మం-దేవరపల్లి గ్రీన్‌ఫీల్డ్

# హైవే సిద్ధం

### రెండు మూడు రోజుల్లో అందుబాటులోకి



**ముద్ర, ఖమ్మం**

తెలుగు రాష్ట్రాలకు కీలకంగా భావిస్తున్న ఖమ్మం–దేవరపల్లి గ్రీన్‌ఫీల్డ్ జాతీయ రహదారి ప్రారంభానికి ముందే రాజకీయ క్రెడిట్ వార్ తెరపైకి వచ్చింది. దాదాపు రూ. 2,214 కోట్ల వ్యయంతో నిర్మించిన ఈ హైవే పనులు పూర్తికాగా, శనివారం ఖమ్మం నుంచి దేవరపల్లి వరకు ట్రయల్ రన్ నిర్వహించాలని జాతీయ రహదారుల అధికారులు నిర్ణయించారు. అయితే ట్రయల్ రన్ సందర్భంగా నిర్వహించే ప్రెస్‌మీట్‌కు ఎవరు నాయకత్వం వహించాలనే అంశంపై కాంగ్రెస్, బీజేపీ నాయకుల మధ్య తీవ్ర విభేదాలు తలెత్తాయి.
కేంద్ర ప్రభుత్వం నిధులు మంజూరు చేసి హైవేను నిర్మించిందని, అందువల్ల ట్రయల్ రన్ ప్రెస్‌మీట్‌ను బీజేపీ ఆధ్వర్యంలో నిర్వహించాలని ఆ పార్టీ నాయకులు పట్టుబట్టారు. మరోవైపు రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ప్రత్యేక కృషి వల్లే ఈ ప్రాజెక్టు వేగంగా పూర్తైందని, ప్రెస్‌మీట్‌ను కాంగ్రెస్ ఆధ్వర్యంలో నిర్వహించాలని ఆ పార్టీ నేతలు అధికారులను కోరారు. మిగతా 02లో

# స్వర్ణాంధ్రకు కొత్త రన్‌వే!

## రూ.18 వేల కోట్ల ప్రాజెక్టులతో ఏపీ అభివృద్ధికి కొత్త ఊపు

- భోగాపురం ఎయిర్‌పోర్టును జాతికి అంకితం చేసిన ప్రధాని
- డబుల్ ఇంజిన్ సర్కార్‌తో డబుల్ స్పీడ్ అభివృద్ధి
- వికసిత్ భారత్‌లో ఏపీ కీలక గ్రోత్ ఇంజిన్: మోదీ
- థింసా నృత్యం చూసి మధురానుభూతి పొందిన ప్రధాని
- కష్టాల్లో ఉన్న ఏపీకి ప్రధాని మోదీ ఆక్సిజన్ ఇచ్చారు: సీఎం




**ముద్ర న్యూస్, భోగాపురం:** ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి చరిత్రలో కీలక ఘట్టంగా నిలిచే భోగాపురం అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయాన్ని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ శనివారం జాతికి అంకితం చేశారు. అదే వేదికపై రూ.18 వేల కోట్ల విలువైన పలు అభి వృద్ధి ప్రాజెక్టులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు నిర్వహించి రాష్ట్ర ప్రగతికి కొత్త ఊపునిచ్చారు. ప్రజలను ఉద్దేశించి మాట్లాడిన ప్రధాని మోదీ.. 'ఏపీ అభివృద్ధి కి ఇది శుభదినం. వికసిత్ భారత్ లక్ష్య సాధనలో ఆంధ్రప్రదేశ్ కీలక గ్రోత్ ఇంజి న్‌గా మారుతోంది. భోగాపురం విమానాశ్రయం ఉత్తరాంధ్ర అభివృద్ధికి కొత్త రన్ వే, యువత భవిష్యత్తుకు లాంచ్‌ప్యాడ్' అని పేర్కొన్నారు. భోగాపురం విమానాశ్రయానికి స్వాతంత్ర్య సమరయోధుడు అల్లూరి సీతారామరాజు మిగతా 02లో

# నేటి నుంచి లష్కర్ బోనాలు

- అమ్మవారి ఆలయాలు ముస్తాబు
- తొలి రోజు మహంకాళికి సమర్పించనున్న బోనాలు
- రెండో రోజు భవిష్యవాణి రంగం,
- గజవాహన ఊరేగింపు

03




## నీట్ బాధిత కుటుంబాలకు రాహుల్ ఓదార్పు

02

### మోడీపై ప్రతిపక్ష నేత విమర్శలు



## అభివృద్ధిలో సరికొత్త మైలురాళ్లు

### దూసుకెళుతున్న తెలంగాణ

- తలసరి ఆదాయంలో భారీ పెరుగుదల
- 10.23% వృద్ధితో తెలంగాణ దూకుడు
- సుపరిపాలనతో రాష్ట్రానికి కొత్త ఊపు
- అభివృద్ధి పథంలో మరిన్ని మైలురాళ్లు సాధిస్తామన్న సీఎం రేవంత్



**ముద్ర హైదరాబాద్ :** డిసెంబర్ 2023లో కొత్త ప్రభుత్వం బాధ్యతలు చేపట్టినప్పటి నుండి తెలంగాణ రాష్ట్రం వేగవంతమైన ప్రగతిని సాధిస్తూ, అభివృద్ధిలో సరికొత్త మైలురాళ్లను తాకుతోందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు. సరైన విధానపరమైన పరిపాలన, పెట్టుబడుల ఆకర్షణ , ఉద్యోగాల కల్పన ద్వారా రాష్ట్రం నేడు దేశంలోనే అత్యుత్తమ ప్రతిభ కనబరుస్తున్న మిగతా 02లో

## ఇదీ AI ముద్ర



సమగ్ర సమాచార పత్రిక
# ముద్ర
ఆదివారం 02.08.2026
www.mudranews.in | @mudranews



## వారానికి కనీసం రెండు సార్లు చేపలు తినండి



ప్రొటీన్లు, ఒమేగా-3, విటమిన్లు, అయోడిన్, సెలీనియం వంటి పోషకాలు సమృద్ధిగా లభిస్తాయి. ఆరోగ్య నిపుణులు వారానికి కనీసం రెండు సార్లు చేపలు తినాలని సూచిస్తున్నారు.

# 'క్రిమినల్ వేస్ట్' కలకలం



**(మొదటి పేజీ తరువాయి)**
హ్యాష్‌ట్యాగ్‌లు ట్రెండ్ అవుతున్నాయి. "మేము క్రిమినల్ వేస్ట్ కాదు.. నవతెలంగాణ నిర్మాతలం" అంటూ విద్యార్థులు మీమ్స్, షార్ట్ వీడియోలు, పోస్టులతో స్పందిస్తున్నారు. ప్రతిపక్ష పార్టీల సోషల్ మీడియా విభాగాలు కూడా ఈ అంశాన్ని పెద్ద ఎత్తున ప్రచారం చేస్తున్నాయి.

**'కాక్రోచ్' తరహా నినాదంగా మారుతుందా?**

సోషల్ మీడియాలో గతంలో విమర్శగా ఉపయోగించిన కొన్ని పదాలను ఉద్యమాల ప్రతీకలుగా మార్చుకున్న ఉదాహరణలను ప్రస్తావిస్తూ, ఇప్పుడు "క్రిమినల్ వేస్ట్" అనే పదాన్ని కూడా నిరసన చిహ్నంగా మలచే ప్రయత్నాలు జరుగుతున్నాయనే చర్చ రాజకీయ వర్గాల్లో వినిపిస్తోంది. కొందరు నెటిజన్లు వ్యంగ్యంగా "క్రిమినల్ వేస్ట్ పార్టీ" వంటి పోస్టులు పెడుతుండగా, దీనిని రాజకీయంగా ఉపయోగించుకునే ప్రయత్నాలు కూడా జరుగుతున్నాయనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. అయితే అలాంటి పార్టీ ఏర్పాటుపై అధికారిక ప్రకటనలు లేదా ఆధారాలు లేవు.

**డిజిటల్ రాజకీయాలకు కొత్త నెరేటివ్?**

డిజిటల్ యుగంలో వివాదాస్పద వ్యాఖ్యలు క్షణాల్లో రాజకీయ ప్రచార ఆయుధాలుగా మారుతున్నాయి. ఒక పదాన్ని వ్యతిరేకతకు ప్రతీకగా మలచడం, మీమ్స్ ద్వారా ఉద్యమాలకు రూపమివ్వడం ఇప్పుడు సాధారణ రాజకీయ వ్యూహంగా మారింది. ఈ నేపథ్యంలో "క్రిమినల్ వేస్ట్" వ్యాఖ్య కూడా యువతలో కొత్త రాజకీయ చర్చకు దారితీసింది.

**కాంగ్రెస్ వివరణ**
ముఖ్యమంత్రి వ్యాఖ్యలను కాంగ్రెస్ నేతలు సమర్థిస్తున్నారు. విద్యార్థులను విమర్శించడం సీఎం ఉద్దేశం కాదని, నైపుణ్యాలు లేని పట్టభద్రులను తయారు చేస్తున్న విద్యా వ్యవస్థలో సంస్కరణలు తీసుకురావాల్సిన అవసరాన్ని మాత్రమే ఆయన ప్రస్తావించారని చెబుతున్నారు. జర్మనీ, ఫిన్లాండ్ వంటి దేశాల మాదిరిగా మొదటి రెండేళ్లు బలమైన ప్రాథమిక విద్య, చివరి రెండేళ్లు పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా ప్రాక్టికల్ శిక్షణ, విదేశీ భాషలు, అప్రెంటిస్‌షిప్‌లపై దృష్టి పెట్టే విధానాన్ని అమలు చేయాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని కాంగ్రెస్ వర్గాలు పేర్కొంటున్నాయి.

**రాజకీయంగా ఎంత దూరం వెళ్తుంది?**

ఒక వ్యాఖ్య చుట్టూ మొదలైన ఈ వివాదం ఇప్పుడు రాజకీయ పోరాటంగా మారింది. ప్రతిపక్షాలు దీనిని యువత ఆత్మగౌరవ అంశంగా ముందుకు తీసుకెళ్లాలని ప్రయత్నిస్తుండగా, కాంగ్రెస్ మాత్రం ఇది విద్యా సంస్కరణలపై జరిగిన చర్చను వక్రీకరించడమేనని వాదిస్తోంది. సోషల్ మీడియాలో కొనసాగుతున్న ట్రెండ్ రాజకీయ ఉద్యమంగా మారుతుందా? లేక కొద్ది రోజుల్లో చల్లారిపోతుందా? అన్నది ఆసక్తికరంగా మారింది.

# రైతులకు గుడ్‌న్యూస్.?

**(మొదటి పేజీ తరువాయి)**
పునరుద్ధరణ విషయంలో తమ ప్రభుత్వం తీసుకుంటున్న శాస్త్రీయ చర్యలను సెంట్రల్ వాటర్ కమిషన్ (CWC) కూడా ఏకీభవించిందని వివరించారు. ఈ మూడు బ్యారేజీల పునరుద్ధరణకు కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తి కట్టుబడి ఉందన్నారు.



**కాంగ్రెస్ నిర్మాణాలే శాశ్వతం: మంత్రి ఉత్తమ్**
ఎల్లంపల్లి ప్రాజెక్ట్‌ను నిర్మించింది కాంగ్రెస్ ప్రభుత్వమని, అది ప్రాణహిత–చేవెళ్ల పథకంలో భాగమని స్పష్టం చేసిన మంత్రి.. దాన్ని కూడా తామే కట్టినట్లు బీఆర్ఎస్ తప్పుడు ప్రచారం చేసుకుంటోందని విమర్శించారు. కాంగ్రెస్ హయాంలో నిర్మించిన డ్యాములు 60 ఏళ్లు పూర్తయినా ఇప్పటికీ చెక్కుచెదరకుండా ఉన్నాయని, కానీ బీఆర్ఎస్ నిర్మించిన ప్రాజెక్టులు మాత్రం కొద్ది ఏళ్లకే ధ్వంసం అయ్యాయని ఎద్దేవా చేశారు.

**దక్షిణ తెలంగాణ సాగునీటి పరిస్థితిపై నిరంతర పర్యవేక్షణ**

కేవలం ఉమ్మడి నిజామాబాద్ జిల్లానే కాకుండా దక్షిణ తెలంగాణ సాగునీటి పరిస్థితులను కూడా ప్రభుత్వం ఎప్పటికప్పుడు నిశితంగా పరిశీలిస్తోందని మంత్రి వెల్లడించారు. ప్రస్తుతం నాగార్జున సాగర్‌కు కూడా ఎగువ నుండి నీళ్లు వచ్చే పరిస్థితులు కనిపిస్తున్నాయని, రైతాంగానికి సాగునీటి కొరత లేకుండా చూసేందుకు ప్రభుత్వం అన్ని రకాల చర్యలు తీసుకుంటోందని ధీమా వ్యక్తం చేశారు.




# ఖమ్మం-దేవరపల్లి గ్రీన్‌ఫీల్డ్ హైవే సిద్ధం

**(మొదటి పేజీ తరువాయి)**
రెండు పార్టీల మధ్య వివాదం మరింత ముదరడంతో అధికారులు చివరికి ట్రయల్ రన్‌ను వాయిదా వేశారు. ఇప్పటికే వైరా నుంచి దేవరపల్లి వరకు వాహనాల రాకపోకలకు అనుమతి ఇచ్చిన అధికారులు, ధంసలాపురం వద్ద రైల్వే ఓవర్‌బ్రిడ్జి పనులు కూడా పూర్తవడంతో పూర్తి స్థాయి ట్రయల్ నిర్వహించేందుకు సిద్ధమయ్యారు. అయితే రాజకీయ వివాదం కారణంగా కార్యక్రమం నిలిచిపోవడంతో హైవే ప్రారంభోత్సవంపైనా అనిశ్చితి నెలకొంది. రెండు మూడు రోజుల్లో చివరి దశ పనులు పూర్తి చేసి ప్రజలకు హైవేను అందుబాటులోకి తీసుకురావాలని అధికారులు భావిస్తున్నారు.





# స్వర్ణాంధ్రకు కొత్త రన్‌వే!

**(మొదటి పేజీ తరువాయి)**
పేరు పెట్టడం గర్వకారణమని పేర్కొన్న ప్రధాని, దేశవ్యాప్తంగా చారిత్రక మహనీయుల పేర్లను విమానాశ్రయాలకు పెడుతున్నామని తెలిపారు.

**థింసా నృత్యం ఆకట్టుకుంది**

విమానాశ్రయం ప్రారంభోత్సవ సందర్భంగా వేలాది గిరిజన మహిళలు ప్రదర్శించిన థింసా నృత్యం తనకు మధురానుభూతిని కలిగించిందని ప్రధాని అన్నారు. ఒకేసారి వేలాది మంది పాల్గొన్న ఈ ప్రదర్శన ఉత్తరాంధ్ర గిరిజన సంస్కృతికి ప్రపంచ వేదికపై ప్రత్యేక గుర్తింపును తీసుకొచ్చిందని ప్రశంసించారు.

ఏపీకి భారీ మౌలిక సదుపాయాల ఊపు
విశాఖ నుంచి కృష్ణపట్నం వరకు పోర్టుల అభివృద్ధి, మూలపేట, రామాయపట్నం కొత్త పోర్టులు, రూ.లక్ష కోట్లకు పైగా రైల్వే ప్రాజెక్టులు, సెమీకండక్టర్, డేటా సెంటర్, ఫార్మా రంగాల్లో పెట్టుబడులతో ఏపీ పారిశ్రామిక కేంద్రంగా ఎదుగుతోందని మోదీ తెలిపారు. బాబు నాయకత్వంలో రాష్ట్రం మ్యానుఫ్యాక్చరింగ్ హబ్‌గా మారుతోందని కొనియాడారు.

**డబుల్ ఇంజిన్ సర్కార్‌తో డబుల్ స్పీడ్**

కేంద్ర–రాష్ట్ర ప్రభుత్వాల సమన్వయంతో అభివృద్ధి మరింత వేగంగా సాగుతోందని ప్రధాని పేర్కొన్నారు. "డబుల్ ఇంజిన్ సర్కార్ వల్లే ఏపీకి డబుల్ స్పీడ్ అభివృద్ధి సాధ్యమవుతోంది. రాష్ట్ర ప్రజల ఆకాంక్షలను నెరవేర్చేందుకు కేంద్రం పూర్తి సహకారం అందిస్తుంది" అని స్పష్టం చేశారు. కార్యక్రమంలో గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, కేంద్ర, రాష్ట్ర మంత్రులు, ప్రజాప్రతినిధులు, జీఎంఆర్ సంస్థ ప్రతినిధులు, భారీ సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు.



**కష్టాల్లో ఉన్న ఏపీకి ప్రధాని మోదీ ఆక్సిజన్ ఇచ్చారు: సీఎం చంద్రబాబు**

భోగాపురం ఎయిర్‌పోర్టు ప్రారంభంతో ఉత్తరాంధ్ర కలలకు రెక్కలొచ్చాయని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వ్యాఖ్యానించారు. కష్టాల్లో ఉన్న ఏపీకి ప్రధాని మోదీ ఆక్సిజన్ ఇచ్చారని కొనియాడారు. రాజధాని అమరావతికి నిధులు ఇచ్చి ప్రధాని అండగా నిలిచారని ఉద్ఘాటించారు. పోలవరం, రైల్వేజోన్, విశాఖ ఉక్కును మోదీ కాపాడారని ప్రశంసించారు. మరో 25 ఏళ్లు ప్రధానిగా మోదీ ఉంటారని వ్యాఖ్యానించారు. ఎయిర్‌పోర్ట్‌కు భూములు ఇచ్చిన రైతులకు పాదాభివందనాలు చేస్తున్నానని పేర్కొన్నారు. ఏపీని పునర్‌నిర్మాణం చేస్తామని హామీ ఇచ్చామని.. చేస్తున్నామని స్పష్టం చేశారు. ఈ రోజు(శనివారం) భోగాపురం ఎయిర్‌పోర్టును ప్రధాని మోదీ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పాల్గొని సీఎం ప్రసంగించారు.

**ఎర్రబస్సు రాదని కొందరు హేళన చేశారు**

ఈ ప్రాంతానికి ఎర్రబస్సు కూడా రాదని కొందరు హేళన చేశారని సీఎం విమర్శించారు. అవహేళన చేసినవారు అడ్రస్ లేకుండా పోయారని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు. ఉత్తరాంధ్రలో సరికొత్త చరిత్రకు నాంది పలికామని ఉద్ఘాటించారు. గూగుల్, స్టీల్ కంపెనీలతోపాటు చాలా సంస్థలు వచ్చాయని వివరించారు. ఉత్తరాంధ్ర దశ, దిశ మారబోతున్నాయని వెల్లడించారు. రెండేళ్ల క్రితం విధ్వంసమైన రాష్ట్రాన్ని చూశామని పేర్కొన్నారు. ప్రధాని మోదీ సహకారంతో ఉత్తరాంధ్రలో 189 ప్రాజెక్టులకు పెట్టుబడులు రాబోతున్నాయని వివరించారు. ఉత్తరాంధ్రలో అన్నిరకాల వనరులు ఉన్నాయని వెల్లడించారు. ఉత్తరాంధ్ర నుంచి వలసలు తగ్గుతాయని అభిప్రాయపడ్డారు. ఇక్కడికే ఇతర ప్రాంతాల నుంచి వలస వచ్చేలా చేస్తామని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు. దేశాన్ని మోదీ 12 ఏళ్లుగా సమర్థంగా నడిపిస్తున్నారని సీఎం కొనియాడారు. దేశాన్ని డిజిటల్ ఇండియాగా మార్చే ఘనత మోదీదేనని ప్రశంసల వర్షం కురిపించారు. సౌరశక్తి, గ్రీన్ హైడ్రోజన్ ద్వారా కాలుష్యం తగ్గిస్తున్నారని తెలిపారు. దేశంలో తీవ్రవాదం, నక్సలిజం లేకుండా చేశారని చెప్పుకొచ్చారు. ప్రధాని మోదీ నాయకత్వంలో దేశం సుభిక్షంగా ఉందని వెల్లడించారు. మోదీ లాంటి నేతను తన రాజకీయ జీవితంలోనే చూడలేదని అన్నారు. నేషన్ ఫస్ట్ అనే ప్రధానిని తొలిసారి చూస్తున్నామని చెప్పారు. 2047లోగా ప్రపంచంలోనే నెంబర్‌వన్‌గా భారత్ ఉందని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు.

**దేశాన్ని వికసిత్ భారత్ దిశగా నడిపిస్తోన్న నేత మోదీ: డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్**

140కోట్ల మంది ప్రజల ఆకాంక్షలను ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సాకారం చేస్తున్నారని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ అన్నారు. ఈ రోజు(శనివారం) భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం ప్రారంభోత్సవంలో పవన్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా అక్కడ ఏర్పాటు చేసిన బహిరంగ సభలో మాట్లాడుతూ.. భారత్‌ను ప్రగతి పథంలో వేగంగా నడిపిస్తోన్న నేత ప్రధాని అని తెలిపారు. దేశాన్ని మోదీ వికసిత్ భారత్ దిశగా నడిపిస్తున్నారని పేర్కొన్నారు. ఒక్కరోజు కూడా సెలవు తీసుకోకుండా పనిచేస్తున్న నేత మోదీ అని కొనియాడారు. తనను దూషించినవారిని క్షమించే గుణం ప్రధానిది అని చెప్పుకొచ్చారు.

# అభివృద్ధిలో సరికొత్త మైలురాళ్లు

**(మొదటి పేజీ తరువాయి)**
అగ్రగామి రాష్ట్రాలలో ఒకటిగా నిలిచిందని ఆయన పేర్కొన్నారు.

**తలసరి ఆదాయంలో సరికొత్త రికార్డు**
రాష్ట్ర ఆర్థిక పురోగతికి అద్దం పడుతూ 2025–26 ఆర్థిక ఆదాయం సంబంధించి తెలంగాణ తలసరి ఆదాయం రూ. 4,18,931కి చేరింది. గతేడాదితో పోలిస్తే ప్రజల తలసరి ఆదాయంలో ఏకంగా రూ. 38,900 పెరుగుదల నమోదవ్వడం విశేషం. కేవలం ఏడాది వ్యవధిలో 10.23% వృద్ధి రేటు సాధించి తెలంగాణ ఆర్థికంగా బలమైన శక్తిగా ఎదిగిందని గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి.

**పారదర్శక పాలనతో నూతన ఉత్సాహం**
గత దశాబ్ద కాలంగా ఉన్న లోపాలను, అస్తవ్యస్తమైన పరిపాలనా విధానాలను సరిదిద్ది, ప్రజా సంక్షేమమే ధ్యేయంగా తమ ప్రభుత్వం పనిచేస్తోందని సీఎం తెలిపారు. సమర్థవంతమైన ప్రణాళికలు, సుపరిపాలన, ఆర్థిక క్రమశిక్షణే ఈ అసాధారణ వృద్ధికి ప్రధాన కారణాలని ఆయన అభిప్రాయపడ్డారు. నాటి లోపాలను సరిదిద్దడం ద్వారా నేడు ప్రజల్లో నూతన ఉత్సాహం, నమ్మకం నింపగలిగామని, ఇదే వేగంతో రాష్ట్రాన్ని మరిన్ని ఉన్నత శిఖరాలకు తీసుకెళ్తామని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు.



# నీట్ బాధిత కుటుంబాలకు రాహుల్ ఓదార్పు

**ముద్ర డెస్క్:**
నీట్ పరీక్ష రద్దు కారణంగా ఆత్మహత్య చేసుకున్న బాధిత కుటుంబాలను ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ కలిసి ఓదార్చారు. బాధితులకు సంబంధించిన ఫొటోలను రాహుల్ గాంధీ సోషల్ మీడియాలో పంచుకున్నారు.



తల్లిదండ్రులకు తమ బిడ్డను కోల్పోవడం కంటే బాధాకరమైనది మరొకటి ఉండదని రాశారు. పరీక్షా విధానంపై తీవ్రమైన ప్రశ్నలు లేవనెత్తి, ప్రధాని మోడీని లక్ష్యంగా చేసుకుని విమర్శలు గుప్పించారు. 'ప్రతి యువకుడి మరణం వెనుక తీరని బాధతో ఉండే ఒక కుటుంబం ఉంటుంది. ఇది మన విచ్ఛిన్నమైన విద్యా వ్యవస్థపై కూడా తీవ్రమైన ప్రశ్నలను లేవనెత్తుతోంది. ప్రశ్నపత్రాలు లీక్ అవుతున్నాయి. పరీక్షలు రద్దవుతున్నాయి. సంవత్సరాల తరబడి చేసిన కృషి రాత్రికి రాత్రే నాశనమవుతోంది. మన విద్యార్థులను నిజాయితీగా కష్టపడమని చెబుతారు. కానీ వారు పనిచేస్తున్న వ్యవస్థే వారితో నిజాయితీగా లేదు.'' అని పేర్కొన్నారు. పేపర్ లీక్ కారణంగా తమ పిల్లలను కోల్పోయిన ఏ తల్లిదండ్రులనూ మోడీ కలవలేదని.. భవిష్యత్తు నాశనమైన ఏ విద్యార్థులతోనూ ఆయన కూర్చోలేదని అన్నారు. భారతదేశ విద్యార్థులకు ప్రధానమంత్రి క్షమాపణ అవసరం లేదని.. పైగా ప్రధానమంత్రే విద్యార్థులకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. తమ పిల్లలను కోల్పోయిన తల్లిదండ్రుల కన్నీళ్లు, విలాపాల కన్నా గొప్ప దుఃఖం మరొకటి ఉండదని అన్నారు. ఈ దుఃఖం శాశ్వతంగా వెంటాడుతుందని.. దానితో పాటు ఈ విచ్ఛిన్నమైన, అవినీతిమయమైన విద్యా వ్యవస్థపై అనేక ప్రశ్నలు మిగిలిపోతాయని పేర్కొన్నారు. పేపర్ లీక్‌లు, పరీక్షల రద్దు, సంవత్సరాల తరబడి చేసిన కృషి క్షణాల్లో వృధా అవుతున్నప్పటికీ, విద్యార్థులను నిజాయితీగా పనిచేయమని అడుగుతున్నారని, కానీ వారు పనిచేస్తున్న వ్యవస్థే నిజాయితీగా లేదని అన్నారు. అయినప్పటికీ ప్రధానమంత్రి విద్యార్థులను 'క్షమించడం' గురించి మాట్లాడుతున్నారని ఎద్దేవా చేశారు.

సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
ఆదివారం 2.08.2026
www.mudranews.in | @mudranews



**చేపలతో ఉపయోగాలు**



చేపలను బాగా ఉడికించి తినడం ఉత్తమం
పులుసు, స్టీమింగ్ లేదా గ్రిల్లింగ్ ద్వారా వండితే పోషకాలు ఎక్కువగా నిలుస్తాయి. వేపుడు అయితే తక్కువ నూనెతో చేయడం మంచిది.

# ఒక్క రోజులోనే రెండు లక్షలు దాటిన మీసేవ లావాదేవీలు

**తొలిసారి రికార్డు స్థాయిలో మీసేవ కార్యకలాపాలు**
**దేశంలోనే నెంబర్ వన్ గా మీసేవ ఆన్లైన్ ప్లాట్ ఫార్మ్**
**మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు**



**ముద్ర, హైదరాబాద్ :** ప్రభుత్వ సేవలు, లావాదేవీలను ఆన్లైన్ లో ఒకే వేదిక మీద అందిస్తోన్న మీసేవ మరొక రికార్డును నమోదు చేసింది. శుక్రవారం (31/07/2026) ఒక్క రోజే 2,20,172 లావాదేవీలు నమోదు అయ్యాయి. ఇలా ఒకే రోజు రికార్డు స్థాయిలో మీసేవ కార్యకలాపాలు జరిగాయని సమాచార సాంకేతిక, ఎలక్ట్రానిక్స్ & కమ్యూనికేషన్స్ శాఖ మంత్రి డి.శ్రీధర్ బాబు వెల్లడించారు.

మీసేవ డిజిటల్ ఫ్లాట్ ఫామ్ ను మరింతగా అభివృద్ధి చేయటం, సేవలను విస్తృత పరచటం, ఆమేరకు ప్రజల వాడకాన్ని ప్రోత్సహించటంలో ప్రజాప్రభుత్వం చొరవచూపిస్తోంది. దీంతో కొత్త రికార్డులు నమోదవుతున్నాయి. రాష్ట్ర పౌరులకు వేగంగా, పారదర్శకమైన, సమర్థవంతమైన సేవలను అందించేందుకు మీసేవ వేదికను ప్రభుత్వం నిరంతరం బలోపేతం చేస్తోందని మంత్రి శ్రీధర్ బాబు తెలిపారు. ఒక్క రోజులో రికార్డు స్థాయిలో ఎలాంటి అవాంతరాలు లేని లావాదేవీల ద్వారా దేశంలోనే నెంబర్ వన్ గవర్నమెంట్ ఆన్లైన్ ప్లాట్ ఫార్మ్ గా మీ సేవ నిలిచిందని మంత్రి అన్నారు.

ప్రతీ రోజు సరాసరి 70 నుంచి 80 వేల కార్యకలాపాలు మీసేవ ద్వారా నమోదవుతాయి. శుక్రవారం ఒకే రోజులో 2.20 లక్షలకు పైగా లావాదేవీలు నమోదయ్యాయి. వీటిల్లో ప్రభుత్వం కొత్తగా తీసుకువచ్చిన ఫ్యామిలీ కార్డు, రవాణాశాఖ, ఆదాయ ధృవీకరణ పత్రాల అప్లికేషన్లు మొదటి మూడు స్థానాల్లో నిలిచాయి.

ఈ ఘనత తెలంగాణ ప్రభుత్వ డిజిటల్ సేవల వ్యవస్థపై ప్రజల్లో నెలకొన్న విశ్వాసానికి నిదర్శనంగా నిలిచిందని మంత్రి ప్రకటించారు. పనితీరును మెరుగుపరచడం, సేవల లభ్యతను విస్తరించడం, కొత్త పౌర సేవలను అందుబాటులోకి తీసుకురావడం, సాంకేతిక, మౌలిక వసతులను బలోపేతం చేయడం లాంటి చర్యల ఫలితంగానే ఈ మైలురాయి సాధ్యమైందని అన్నారు.

రాష్ట్రవ్యాప్తంగా మీసేవ కేంద్రాల ద్వారా ఎలాంటి అంతరాయం లేకుండా ప్రజలకు సేవలను అందించడంలో విశేష కృషి చేసిన నిర్వాహకులు, సాంకేతిక బృందాలను మంత్రి అభినందించారు.

మీసేవ ద్వారా ప్రస్తుతం ఫ్యామిలీ కార్డు, ఆదాయ, కుల, నివాస ధ్రువపత్రాలు, వివిధ రిజిస్ట్రేషన్లు, ప్రభుత్వ యుటిలిటీ చెల్లింపులు, అలాగే పలు ప్రభుత్వ శాఖలకు సంబంధించిన సేవలు రాష్ట్రవ్యాప్తంగా ఉన్న మీసేవ కేంద్రాల్లో డిజిటల్ వేదికల ద్వారా ప్రజలకు సులభంగా అందుబాటులో ఉన్నాయి.

అవసరాలకు అనుగుణంగా మరిన్ని సేవలను మీసేవలో చేర్చడం, ఆధునిక సాంకేతికతను వినియోగించడం, సేవల నాణ్యత, వేగం, పారదర్శకతను మరింత మెరుగుపరచడం ద్వారా ప్రజలకు అత్యుత్తమ సేవలను అందించేందుకు కట్టుబడి ఉన్నామని మంత్రి శ్రీధర్ బాబు తెలిపారు.

## పప్పు, ఆయిల్ పామ్ సాగు పెంచాలి: గవర్నర్ శుక్ల



**ముద్ర, హైదరాబాద్:** దేశంలో పప్పు దినుసులు, వంట నూనెల కొరతను తగ్గించాలంటే పప్పు పంటలు, ఆయిల్ పామ్ సాగుపై ప్రత్యేక దృష్టి సారించాలని రాష్ట్ర గవర్నర్ శివ ప్రతాప్ శుక్ల సూచించారు. శనివారం లోక్ భవన్ లో రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్మన్, ఎల్ నినో నిపుణుల కమిటీ చైర్మన్ డాక్టర్ జీ. చిన్నారెడ్డి నేతృత్వంలోని బృందం గవర్నర్ ను కలిసి ఎల్ నినో ప్రభావంపై రూపొందించిన నిపుణుల కమిటీ నివేదికను అందజేసింది. ఈ సందర్భంగా వ్యవసాయం, అనుబంధ రంగాలపై గవర్నర్ బృందంతో విస్తృతంగా చర్చించారు. దేశవ్యాప్తంగా పప్పు దినుసుల కొరత కారణంగా భారీ మొత్తంలో దిగుమతులు చేసుకోవాల్సి వస్తోందని, అలాగే వంట నూనెల అవసరాల కోసం కూడా విదేశాలపై ఆధారపడుతున్నామని పేర్కొన్నారు. ఈ పరిస్థితిని అధిగమించాలంటే పప్పు పంటలు, ఆయిల్ పామ్ సాగును మరింత ప్రోత్సహించాలని సూచించారు.

తెలంగాణలో ఆయిల్ పామ్ సాగు సంతృప్తికరంగా సాగుతోందని గవర్నర్ అభినందించారు. అలాగే రాష్ట్ర ప్రభుత్వం హార్టికల్చర్, కూరగాయల సాగు అభివృద్ధికి తీసుకుంటున్న చర్యలు ప్రశంసనీయమని పేర్కొంటూ, ఇదే స్ఫూర్తితో ముందుకు సాగాలని సూచించారు.

ఎల్ నినో ప్రభావాన్ని ఎదుర్కొనేందుకు నిపుణుల కమిటీ చేసిన సిఫార్సులు సమగ్రంగా ఉన్నాయని, నివేదిక ఎంతో ఉపయోగకరంగా ఉందని గవర్నర్ శివ ప్రతాప్ శుక్ల డాక్టర్ జీ. చిన్నారెడ్డి, కమిటీ సభ్యులను అభినందించారు. సమావేశంలో వ్యవసాయ శాఖ ముఖ్య కార్యదర్శి సురేంద్ర మోహన్, వ్యవసాయ శాఖ డైరెక్టర్ గోపి, హార్టికల్చర్ డైరెక్టర్ యాస్మిన్ బాషా పాల్గొన్నారు.

## ఎల్లంపల్లి నీటి విడుదలపై మంత్రికి జువ్వాడి కృతజ్ఞతలు

ముద్ర, కోరుట్ల: ఎల్లంపల్లి ప్రాజెక్టు నుంచి నీటిని విడుదల చేసిన భారీ నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డికి వెలమ కార్పొరేషన్ చైర్మన్ జువ్వాడి నర్సింగ్ రావు కృతజ్ఞతలు తెలిపారు. కోరుట్ల, బాల్కొండ, వేములవాడ నియోజకవర్గాలకు చెందిన సుమారు 500 మంది రైతుల విజ్ఞప్తిపై జిల్లా మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ దృష్టికి సమస్యను తీసుకెళ్లి, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం, కాంగ్రెస్ నాయకుడు సునీల్ రెడ్డితో సమన్వయం చేసి మంత్రికి వినతిపత్రం అందజేసినట్లు తెలిపారు. దీనిపై సానుకూలంగా స్పందించిన మంత్రి శనివారం నీటిని విడుదల చేయడంతో రైతులకు ఊరట లభించిందని జువ్వాడి నర్సింగ్ రావు పేర్కొన్నారు.

# నేటి నుంచి లష్కర్ బోనాల ఉత్సవం

**తొలి రోజు మహంకాళికి సమర్పించనున్న బోనాలు**




**ముద్ర, సికింద్రాబాద్:** లష్కర్ బోనాల జాతరకు సర్వం సిద్ధమవుతోంది. ఉజ్జయినీ మహంకాళి ఆలయంతోపాటు సికింద్రాబాద్‌లోని పలు అమ్మవారి ఆలయాలకు రంగులు వేసి, విద్యుత్ దీపాలతో అలంకరిస్తున్నారు. ఆగస్టు 2, 3 తేదీల్లో జరగనున్న ఉత్సవాలకు 25 నుంచి 30 లక్షల మంది భక్తులు వచ్చే అవకాశం ఉండడంతో అన్ని శాఖల అధికారులు ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు. వర్షాల నేపథ్యంలో భక్తులకు ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకుంటున్నారు.ఉత్సవాల్లో అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు కట్టుదిట్టమైన భద్రత కల్పించనున్నారు. మహంకాళి పోలీస్ స్టేషన్‌లో తాత్కాలిక కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేస్తున్నారు. సీసీ కెమెరాల నిఘాతో భద్రతను పర్యవేక్షించనున్నారు. భక్తుల సౌకర్యార్థం 6 క్యూ లైన్లను ఏర్పాటు చేస్తుండగా, ఇందులో రెండు బోనాల క్యూ లైన్లు, రెండు జనరల్ లైన్లు, రెండు వీఐపీ లైన్లు ఉండనున్నాయి. భక్తుల దాహార్తిని తీర్చేందుకు జలమండలి అధికారులు 5 వాటర్ క్యాంపులను ఏర్పాటు చేస్తున్నారు. వైద్య ఆరోగ్య శాఖ మూడు మెడికల్ క్యాంపులను ఏర్పాటు చేస్తోంది. ఆలయానికి వచ్చే భక్తుల వాహనాలను పార్క్ చేయడానికి 8 పార్కింగ్ స్థలాలను కేటాయించారు. హరిహర కళా భవన్ పక్క రోడ్డు, మహబూబ్ కళాశాల స్కూల్, ఓల్డ్ జైల్ ఖానా, మోండా మార్కెట్ వెనుక ఇస్లామియా స్కూల్, అడవయ్య ఎక్స్ రోడ్డు సమీపంలోని ఆదయ్య మెమోరియల్ స్కూల్, ఎంజీ రోడ్డులోని గాంధీ విగ్రహం వద్ద, బెల్సన్ తాజ్ హోటల్ వద్ద, తాజ్ త్రీస్టార్ హోటల్ వద్ద వాహనాలను పార్కింగ్ చేయవచ్చు.

## బట్టకాల్చి మీద వేస్తానంటే ఊరుకునే ప్రసక్తే లేదు

- **అవినీతికి తావులేకుండా ప్రజలకు సేవలందిస్తున్నాం**
- **యూఐడీఎఫ్ నిధుల టెండర్లతో మాకు సంబంధమే లేదు**
- **టెండర్ల వ్యవహారం రాష్ట్ర ప్రభుత్వ పరిధిలోనిది**
- **ఆరోపించిన వారికి లీగల్ నోటీసులు ఇవ్వండి..కోర్టుకీడ్వండి**
- **మేయర్, డిప్యూటీ మేయర్లకు బండి సంజయ్ ఆదేశం**



**ముద్ర, కరీంనగర్ :** కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్ యూఐడీఎఫ్ నిధుల టెండర్ల వ్యవహారంలో తమకు ఎలాంటి సంబంధం లేదని, అయినప్పటికీ బీఆర్ఎస్ నేతలు కావాలనే అవినీతి ఆరోపణలు చేస్తున్నారని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ అన్నారు. శనివారం కరీంనగర్ పర్యటనలో భాగంగా మేయర్ కొలగాని శ్రీనివాస్, డిప్యూటీ మేయర్ సునీల్ రావుతో సమావేశమైన ఆయన ఈ అంశంపై చర్చించారు.

ఈ సందర్భంగా బండి సంజయ్ మాట్లాడుతూ, యూఐడీఎఫ్ టెండర్లు పూర్తిగా రాష్ట్ర ప్రభుత్వ పరిధిలోని అంశమని, బీజేపీ నాయకులకు ఎలాంటి సంబంధం లేదన్నారు. గతంలో అవినీతి, అక్రమాలతో కార్పొరేషన్‌ను భ్రష్టుపట్టించిన వారే ఇప్పుడు నిరాధార ఆరోపణలు చేస్తున్నారని విమర్శించారు. అటువంటి దుష్ప్రచారాన్ని ఉపేక్షించవద్దని, సంబంధిత వ్యక్తులకు వెంటనే లీగల్ నోటీసులు పంపాలని మేయర్, డిప్యూటీ మేయర్‌లకు సూచించారు. క్షమాపణ చెప్పకపోతే చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.కరీంనగర్ ప్రజలు అవినీతికి వ్యతిరేకంగా బీజేపీకి మద్దతు ఇచ్చారని, పారదర్శక పాలన అందిస్తున్నందుకే కొందరు అసత్య ప్రచారం చేస్తున్నారని బండి సంజయ్ పేర్కొన్నారు. తప్పు చేయనప్పుడు భయపడాల్సిన అవసరం లేదని, వ్యక్తిగత ప్రతిష్ఠను దెబ్బతీసే తప్పుడు ఆరోపణలపై చట్టపరంగా పోరాడతామని స్పష్టం చేశారు.

# యువత శక్తికి మోడీ దిగొచ్చారు

**వాట్సాప్ అంకుల్స్ vs ఇన్‌స్టాగ్రామ్ కిడ్స్ పోరాటమన్న కేటీఆర్**
**జెన్ జీ ఉద్యమం దేశ రాజకీయాలను కదిలించింది**



**ముద్ర, హైదరాబాద్ :** దేశంలో యువతరం కదం తొక్కిందని, మునుపెన్నడూ లేని విధమైన కొత్త తరహాలో జెన్ జీ యువత ఢిల్లీ వీధుల్లో చేపట్టిన ఆందోళన దెబ్బకు ప్రధాని నరేంద్ర మోడీ అర్ధరాత్రి వీడియో పెట్టాల్సిన పరిస్థితి వచ్చిందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. నరేంద్ర మోడీ ఎవరితో పెట్టుకోకూడదో ఆ పిల్లలతోనే పెట్టుకున్నారని, యువతం కదం తొక్కితే ప్రభుత్వానికే కాదు మోడీ మీడియాకు కూడా బల్బులు ఎగిరిపోయాయన్నారు. ఢిల్లీలో జరిగిన పోరాటం వాట్సాప్ అంకుల్స్ కు, ఇన్ స్టాగ్రామ్ పిల్లలకు మధ్య జరిగిందని ఈ పోరాటంలో ఎవరుగెలిచారో దేశమంతా చూసిందన్నారు. జెన్ జీ పిల్లలు సీబీఐ, ఈడీకి భయపడేరకం కాదన్నారు. ఇవాళ ఓ తెలుగు దినపత్రిక వార్షికోత్సవానికి ముఖ్య అతిథిగా హాజరైన కేటీఆర్ ఈ సందర్భంగా మాట్లాడుతూ హాట్ కామెంట్స్ చేశారు.

**నాన్ బయోలాజికల్ మెడలు వంచారు:**

యువతరాన్ని చూసి దేశంమీద పట్టింపు లేదని మా వయసు వారు అనుకుంటున్నాం. కానీ అది నిజం కాదని వారికి మాకంటే ఎక్కువ నమ్మకం, దేశంపట్ల మాకంటే ఎక్కువ ప్రేమ ఉందని మొన్నటి ఢిల్లీ ఉద్యమంతో తేలిపోయిందన్నారు. కాక్రోచ్ ఉద్యమాన్ని మీడియా పట్టించుకోలేదు. చివరకు నాన్ బయోలాజికల్ అని చెప్పుకునే వారి మెడలు వంచారంటే అది మామూలు విషయం కాదన్నారు. ఇది ప్రధాన ప్రతిపక్షాలుగా మేము చేయలని పనిని ఈ దేశ యువత చేసి చూపి మాకు ఓ దారి చూయించారని చెప్పారు. ట్రెడిషనల్, మెయిన్ స్ట్రీమ్ మీడియాను ప్రభుత్వాలు మేనేజ్ చేశారన్నారు.

**సోషల్ మీడియా లేకపోతే చలనమెక్కడిది?:**

సోషల్ మీడియాకు హద్దులు ఉండాలని కొంత మంది మాట్లాడుతున్నారు. కానీ ఈ పరిమితులు నియమించేది ప్రభుత్వాలా? స్వేచ్ఛకు హద్దులు పెడితే అది వాక్ స్వాతంత్రం ఎలా అవుతుందని ప్రశ్నించారు. స్వేచ్ఛ అంటే బూతులతో మాట్లాడం కాదని సోషల్ మీడియా లేకపోతే ప్రభుత్వాలలో చలనం వచ్చేది కాదన్నారు. పొరుగు రాష్ట్రం తమిళనాడులో మన సీఎం మాట్లాడితే అదే కార్యక్రమంలో ఉన్న నేను మన సీఎంమాటను సమర్థిస్తూ మాట్లాడాను. కానీ రేవంత్ రెడ్డి మాత్రం మా రక్తం కావాలంటూ మాట్లాడుతున్నారని కేటీఆర్ గుర్తు చేశారు. మా భాష కాదు రేవంత్ రెడ్డి భాషని అదుపులో పెట్టుకోమని చెప్పాలని ఇదే కార్యక్రమానికి హాజరైన టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్‌కు విజ్ఞప్తి చేశారు. మీడియాను మేనేజ్ చేయడం ద్వారా ప్రజల్లో నెరేటివ్ డ్రైవ్ చేయవచ్చని ప్రభుత్వాలు భావిస్తున్నాయి. ప్రశాంత్ కిశోర్ లాంటి వారు ఇదే తెబుతున్నారు. కానీ ఢిల్లీలోజరిగిన ఆందోళనలు సంప్రదాయ మూసపద్ధతుల ఆలోచలకు భిన్నంగా యువతరం కందం తొక్కిందన్నారు.

## సనాతన ధర్మమే మన జీవన విధానం

**-బ్రహ్మశ్రీ డాక్టర్ గర్రెపల్లి మహేశ్వర శర్మ**

**ముద్ర, కోరుట్ల :** ప్రాచీన భారత నాగరికతలోని సనాతన ధర్మమే మన జీవన విధానమని శృంగేరి శారదాపీఠ ఆస్థాన పౌరాణికులు, పురాణ ప్రవర బ్రహ్మశ్రీ డాక్టర్ గర్రెపల్లి మహేశ్వరశర్మ పేర్కొన్నారు. సనాతన ధర్మ ప్రచార సమితి ఆధ్వర్యంలో చేపట్టిన అష్టాదశ మహాపురాణ ప్రవచన జ్ఞాన యజ్ఞంలో భాగంగా 7వ అనుగ్రహంగా శ్రీ బ్రహ్మ మహాపురాణ ప్రవచన సప్తాహం కోరుట్ల వాసవి కళ్యాణ భవనంలో శనివారం సాయంత్రం ఘనంగా ప్రారంభమైంది. ఈ సందర్భంగా మహేశ్వర శర్మ ప్రవచనం చేస్తూ బ్రహ్మ దేవుడు చెప్పడం వల్ల దీనికి బ్రహ్మ మహాపురాణం అనే పేరు వచ్చిందన్నారు. మానవ జీవన విధానానికి అవసరమైన జ్ఞానాన్ని అందించేవే అష్టాదశ మహా పురాణాలని మహేశ్వరశర్మ వివరించారు. మొదట సనాతన ధర్మ ప్రచార సమితి శాశ్వత సభ్యులు పుల్లూరి గోపాలకృష్ణమూర్తి, ఎల్లంకి శ్రీధర్ దంపతులు గురు వందనం చేయగా, సమితి సాంస్కృతిక కార్యదర్శి భోగ శ్రీధర్ గురు పరిచయం చేశారు. కార్యక్రమంలో సనాతన ధర్మ ప్రచార సమితి సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

## కూరగాయల మార్కెట్ ను సద్వినియోగం చేసుకోవాలి..



**ముద్ర చిగురుమామిడి :** గ్రామ ప్రజల చిరకాల ఆకాంక్ష అయినా కూరగాయల మార్కెట్ ను శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయం ముందు శనివారం గ్రామ సర్పంచ్ జంగ శిరీష వెంకటరమణారెడ్డి ఘనంగా ప్రారంభించారు.ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ జంగ శిరీష వెంకట రమణారెడ్డి, పాలక వర్గం సభ్యులతో కలిసి కొబ్బరికాయలు కొట్టి ఈ మార్కెట్‌ను ప్రజలకు అందుబాటులోకి తీసుకువచ్చారు.ఈ సందర్భంగా సర్పంచ్ జంగ శిరీష వెంకటరమణారెడ్డి మాట్లాడుతూ గ్రామస్తులకు తాజా కూరగాయలు ఒకే చోట,అందుబాటు ధరల్లోకి తీసుకురావాలనే ఉద్దేశంతోనే ఈ మార్కెట్‌ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సింగిల్ విండో చైర్మన్ జంగా వెంకటరమణారెడ్డి,గ్రామ పంచాయతీ కార్యదర్శి గొల్లోని సంపత్,ఉపసర్పంచ్ మెడబోయిన రాజు,మార్కెట్ కమిటీ డైరెక్టర్ ఓరుగంటి భారతీదేవి,వార్డు సభ్యులు పెసరి ప్రమీల శ్రీనివాస్, మంథన ప్రియాంక మహేందర్,ఎనగందుల రాజేశ్వరి లక్ష్మణ్,శ్రీమూర్తి శ్రీనివాస్, పెసరు రాధాకృష్ణ, కవాటి మంజుల అనిల్,వంతడుపుల దిలీప్ కుమార్,న్యాయవాది బాకం సంపత్,వివిధ పార్టీల నాయకులు,గ్రామ పెద్దలు ,ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# రోబోట్ తో గుండె మైట్రల్ వాల్వ్ మార్పిడి

- **5 గంటలకు పైగా సర్జరీ**
- **హైదరాబాద్ లోనే అరుదైన సర్జరీ**



**ముద్ర, హైదరాబాద్ :** గచ్చిబౌలిలోని కిమ్స్ హాస్పిటల్ వైద్యులు రోబోటిక్ సాంకేతికతతో 37 ఏళ్ల రాజమండ్రి యువకుడికి మైట్రల్ వాల్వ్ మార్పిడి శస్త్రచికిత్సను విజయవంతంగా నిర్వహించారు. కిమ్స్ గచ్చిబౌలిలో తొలిసారిగా జరిగిన ఈ శస్త్రచికిత్స హైదరాబాద్‌లో మినిమల్ ఇన్వేసివ్ గుండె శస్త్రచికిత్సల్లో మరో మైలురాయిగా నిలిచింది.

చీఫ్ కార్డియోథొరాసిక్, రోబోటిక్ & మినిమల్ ఇన్వేసివ్ సర్జన్ డా. నిసర్గ వివరాల ప్రకారం, రుమాటిక్ గుండె వ్యాధితో తీవ్ర మైట్రల్ స్టెనోసిస్‌తో బాధపడుతున్న రోగికి జూలై 23న ఐదు గంటలపాటు శస్త్రచికిత్స నిర్వహించారు. గత మూడేళ్లుగా మందులతో చికిత్స పొందుతున్నప్పటికీ వ్యాధి తీవ్రత పెరగడంతో ఆపరేషన్ అవసరమైంది.

రోబోటిక్ విధానంలో ఛాతీ ఎముకను కోయకుండా చిన్న రంధ్రాల ద్వారా శస్త్రచికిత్స చేయడం వల్ల రక్తస్రావం, నొప్పి, ఇన్ఫెక్షన్ ప్రమాదం తగ్గడంతో పాటు రోగి త్వరగా కోలుకుంటాడని వైద్యులు తెలిపారు. శస్త్రచికిత్స జరిగిన కొన్ని గంటల్లోనే వెంటిలేటర్ తొలగించగా, మరుసటి రోజే రోగి నడవగలిగాడని డా. నిసర్గ వెల్లడించారు.

ఈ శస్త్రచికిత్స బృందంలో కార్డియాక్ సర్జన్ డా. వినీత్, కార్డియాక్ అనస్తీషియాలజిస్టులు డా. దివ్య, డా. గోరింత, డా. భవాని, సీనియర్ సర్జికల్ అసిస్టెంట్ మనోహ, సీనియర్ క్లినికల్ పెర్ఫ్యూషనిస్టులు దయాకర్ స్వామి, జగన్మోహన్, జూనియర్ పెర్ఫ్యూషనిస్ట్ అభిషేక్ పాల్గొన్నారు. హైదరాబాద్‌లో అత్యాధునిక రోబోటిక్ గుండె శస్త్రచికిత్సలకు కిమ్స్ గచ్చిబౌలి కేంద్రంగా ఎదుగుతోందని, రోగులకు ప్రపంచ స్థాయి మినిమల్ ఇన్వేసివ్ చికిత్సలను అందుబాటులోకి తీసుకురావడమే తమ లక్ష్యమని తెలిపారు.

## ఉప్పల్ నల్ల చెరువుకు జలకళ.. సీఎం రేవంత్‌రెడ్డి హర్షం



**ముద్ర, హైదరాబాద్ :** ఉప్పల్ నల్ల చెరువు జలకళ సంతరించుకుంది. దీనిపై సీఎం రేవంత్‌రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. చెరువుల పునరుజ్జీవంతో హైదరాబాద్ రూపురేఖలు మారటం సంతృప్తినిచ్చిందన్నారు. క్యూర్ పరిధిలోని చెరువులకు హైడ్రా జీవం పోస్తోందన్నారు. నల్ల చెరువు పునరుజ్జీవానికి అహర్నిశలు శ్రమించిన హైడ్రా యంత్రాంగానికి రేవంత్‌రెడ్డి అభినందనలు తెలిపారు

నా తెలంగాణ కోటి రతనాల వీణ అన్నాడు 'దాశరథి'.. నైజాం పాలనలో 'బండెనక బండి కట్టి'.. పాటలతో ఉద్యమాన్ని రగిలించిననేల ఇదీ.. తెలంగాణ రక్తంలోనే కవిత్వం ఉంది.. కవులు, కళాకారులకు ఈ నేల పుట్టినిల్లు.. అందుకే మీలోని రచయితను మేల్కొలపండి.. కవితలు, వ్యాసాలు, సంపాదకీయాలు ఏవైనా సరే.. మేం ప్రచురిస్తాం.. మన 'ముద్ర'లో ఎడిటోరియల్ గా మీ భావాలను వ్యక్తీకరించండి..

మీ రచనలు పంపాల్సిన వాట్సాప్ నం.: +91 98496 23744
అలాగే ఈ-మెయిల్ కూడా చేయొచ్చు: mudradaily@gmail.com

# కురుక్షేత్ర సంగ్రామానికి కారణాలు ఎన్నెన్నో!

ఊహించండి ఒకవేళ చరిత్ర యొక్క 'మలుపు' కేవలం ఒక్క సంఘటనతో జరిగితే మహా భారత యుద్ధం జరిగేది కాదు. మహా భారత యుద్ధం సాదా సీదాగా జరిగిన యుద్ధం కాదు. కేవలం ఒక్క రోజులోనే ప్రారంభం కాలేదు. దీని వెనుక సంవత్సరాలుగా జరిగిన జరుగుతున్న పరిణామాలు కాస్తా క్రమక్రమంగా మొత్తం ఆర్యావర్తనం వినాశనం వైపు నెట్టేసింది. మహా భారతంలోని పదకొండు (11) సంఘటనలు ఇవి చివరికి ఇతిహాసపు కురుక్షేత్ర యుద్ధానికి బీజం వేశాయి.



### మొదటి సంఘటన

ఒకవేళ బీష్ముడు 'బీష్మ ప్రతిజ్ఞ' చేసి ఉండకపోతే మహా భారతం యొక్క సందేశం మరో రకంగా ఉండేది. బీష్ముడి తండ్రి ఐన శంతనుడి సుఖం కోసం దేవవ్రతుడు ఆజన్మ బ్రహ్మచారిగా ఉంటానని చేసిన 'శపదం' అలాగే హస్తినపుర సామ్రాజ్యంపై తన అధికారం ఎప్పుడు ఉండదని త్యాగంతో కూడిన ప్రకటన చేయడం ఇదే 'ప్రతిజ్ఞ' ముందు ముందు మొత్తం కురు వంశానికే పెద్ద సమస్యగా మారింది. భీష్ముడికి పెళ్లికాకపోవడం వల్ల కల్గిన హస్తినాపురపు ఉత్తరాదికారి (రాజు) సమస్య ఉత్పన్నమైంది. వేదవ్యాసుడి ద్వారా దృతరాష్ట్రుడు, పాండురాజు, విదురుడు జన్మించారు. అనంతరం కౌరవులు, పాండవుల మధ్య సింహాసనం కోసం వారసత్వ యుద్ధం మొదలైంది. ఒకవేళ ఆ సమయంలో భీష్ముడు ఈ భయంకరమైన 'శపధం' చేసి ఉండకపోతే హస్తినాపురపు యువరాజు సమస్య కౌరవుల/ పాండవుల వరకు వచ్చి ఉండేది కాదేమో. అలాగే మాహా భారతంలో కురుక్షేత్రం లాంటి యుద్ధ సంకటం కుడా రాకపోయేదేమో... ఇదే కారణంగా భీష్ముడి ప్రతిజ్ఞను మహా భారత ఇతిహాసపు అన్నింటి కంటే నిర్ణయాత్మకమైన 'మలుపుగా' (Turning) పండితులు భావిస్తారు.

### రెండవ సంఘటన

బాల్యంలోనే భీముడికి విషం ఇచ్చి చంపాలని ప్రణాళికను రచించటం. కౌరవులకు పాండవులకు మధ్య "శత్రుత్వం" అనేది బాల్యంలోనే మొగ్గ తొడిగింది. ఈ సంఘటనతోనే దుర్యధనుడు భీముడి "బలం" గూర్చి అసూయ చెందేవాడు. తన మామ ఐన శకునితో కలిసి భీముడి అడ్డు తొలగించుకుంటే మిగితా పాండవులు అణిగిమణిగి ఉంటారని పథకం వేశాడు. అందులో భాగంగా ఒక రోజు భీముడికి విషం కలిపిన భోజనం వడ్డిస్తాడు. అది తిన్న భీముడు స్పృహ కోల్పోయిన తరుణంలో కట్టివేసి గంగానదిలో విసిరి వేస్తాడు. దీనివల్ల భీముడు దుర్ఘటనతో చనిపోయాడని అందరికి విశ్వాసం కల్గుతుందని దుర్యోధనుడి ఆలోచన. కానీ విధి మరోలా జరిగింది. తానొకటి తలిస్తే దైవం మరొకటి తలుస్తుందని భీముడు స్పృహ కోల్పోయి నాగలోకం చేరుకుంటాడు. అక్కడ సర్పాలు భీముడి శరీరంలోని విషాన్ని లాగేస్తాయి. నాగరాజు వాసుకి సంరక్షణలో భీముడికి దివ్యమైన శక్తులు, బలం చేకూరింది. ఇప్పుడు భీముడు గతంలో కన్నా మరింత శక్తిశాలిగా మారాడు. ఈ సంఘటన ద్వారానే పాండవులు, కౌరవుల మధ్య విశ్వాసం సన్నగిల్లడం, శత్రుత్వం బీజాలు వేసుకోవడానికి ప్రధాన కారణం అయింది. దీని తరువాత ఇరు పక్షాల మధ్య సుహృద్భావ వాతావరణం సన్నగిల్లిందని చెప్పాలి.

### మూడవ కారణం

లక్క గృహ దహనం. భీముడిని చంపివేయాలనే ప్రణాళిక పారకపోవడం వల్ల దుర్యోధనుడు మరియు శకుని పాండవులను మొత్తంగా చంపి వేయాలని మరొక భయంకరమైన కుట్రను పన్నారు. అది లక్క గృహ దహనం. ఈసారి వారు నిర్మించిన ఇల్లు లక్క, నెయ్యి, నూనెలు మొదలైన వాటితో క్షణాల్లో ఆ గృహం మంటలు అంటుకొని తగలబడి పోయేలా ప్రణాళికను రచించారు. దృతరాష్ట్రుడు ఉత్సవాల పేరిట పాండవులను వానరావ్రతం పంపాడు. అక్కడ వారికి లక్క గృహం అతిధి గృహంగా ఇవ్వబడుతుంది. రాత్రి సమయంలో వారు బస చేస్తున్నప్పుడు నిప్పుపెడితే అందులో అందరు బూడిదగా మారిపోతారని వారి వ్యూహం. కానీ ఈ విషయం విధురుడికి తెలియడం వల్ల భీష్ముడు జోక్యం చేసుకొని గృహ నిర్మాణ సమయంలో ఎవరికీ తెలియకుండా దానికి ఓ "సొరంగం" ఏర్పాటు చేయిస్తాడు. ఆపద సమయంలో పాండవులు ఆ సొరంగం గుండా బయట పడాలనేది దాని సారాంశం. సమయం ఆసన్నమైంది. పాండవులు, వారి తల్లి కుంతీదేవి అదే సొరంగం గుండా క్షేమంగా బయటపడి తప్పించుకుంటారు. కానీ ఆర్యావర్తనం మొత్తం పాండవులు లక్క గృహంలో చనిపోయారని అనుకుంటారు. కానీ జరిగింది మరొకటి. ఈ సంఘటన వల్ల కౌరవులకు పాండవులకు మధ్య సన్నగిల్లుతున్న ఆశలకు మరింత అగాధం / అంతరం పెంచింది. ఇప్పుడు కేవలం ఇరువర్గాల మధ్య పాలనాపరమైన వైరుధ్యమే కాకుండా ఇది ఎలాంటి సంఘర్షణకు దారి తీసిందంటే దాని అంతం "కురుక్షేత్ర యుద్ధం" లాంటి దానితోనే "శత్రుత్వం" పరిసమాప్తం అయింది.

### నాలుగో సంఘటన

ఇంద్రప్రస్థ నగర నిర్మాణం, రాజసూయ యాగం లక్క గృహ దహనం అనంతరం పాండవులు జీవించి రావటం వల్ల హస్తినాపుర సామ్రాజ్యపు వారసత్వం విషయంలో తలెత్తిన సంఘర్షణను నివారించడానికి దృతరాష్ట్రుడు ఖండవ ప్రస్థానంలో దేనికి పనికిరాని బంజరు భూములను పాండవులకు ఇచ్చి అక్కడే ఉండమని సలహా ఇస్తాడు. దానికి అంగీకరించిన పాండవులు శ్రీకృష్ణుడి పర్యవేక్షణలో అలాగే పాండవుల కృషి ఫలితంగా ఆ బంజరు భూమిలో "ఇంద్రప్రస్థము" లాంటి భవ్యమైన నగర నిర్మాణం రూపు దిద్దు కుంది. దీని అనంతరం యుధిష్టీరుడు రాజ సూయ యాగం నిర్వహించ తలపెట్టి పొరుగు రాజ్యాల రాజులను, స్వయంగా హస్తీనాపురం నుండి దుర్యోధనుడు కూడా హాజరౌతాడు. ఈ యాగం అనంతరం యుధిష్టీరుడిని "సామ్రాట్" గా నిశ్చయించటం జరుగుతుంది. దీనివల్ల పెరిగిన పాండవుల గౌరవం, వైభవము, నగర నిర్మాణాన్ని చూసి అచ్చెరువొందిన దుర్యోధనుడు ఈర్ష్య, అసూయతో రగిలిపోయాడు.

### ఐదవ సంఘటన

ఇంద్ర ప్రస్థంలోని అద్భుతమైన నిర్మాణాలతో ఆశ్చర్య చకితుడైన దుర్యోధనుడు, నీటి కొలనులో తామరలు ఉండటాన్ని చూసి కాలు వేస్తాడు. కానీ అవి నిర్మాణశైలివి అని తెలుసుకుంటాడు. మరోచోట అలాంటిదే ఉండటం వల్ల మళ్ళీ కాలుపెట్టి భంగపడతాడు. ఈ దృశ్యాన్ని స్వయంగా ద్రౌపది మరియు ఆమె చెలికత్తెలు చూసి నవ్వుతారు. ఈ సంఘటనతో అవమానంపాలైన దుర్యోధనుడు హస్తినాపురం వచ్చి ప్రతీకారం తీర్చుకోవడానికి పథకరచన చేస్తాడు. ఈ సంఘటనతో దుర్యోధనుడి అహంకారం మరింత ఎక్కువైంది. ఆ క్షణంలోనే మనస్సులో పాండవుల "రాజ్య వైభవము" సాధ్యమైనంత త్వరగా లాక్కోవాలని నిశ్చయించుకుంటాడు. శకునితో కలిసి మాయా జూదమునకు పాండవులను ఆహ్వానించి పాచికలు ఆడేలా ఒప్పిస్తాడు.

### ఆరవ సంఘటన

మాయ జూదము ఆడటం మేనమామ మాయ పాచికలతో ముందే నిర్ణయించుకున్న ప్రణాళికలో భాగంగా ఎలాంటి అస్త్ర శస్త్రములు వాడకుండా మాయా పాచికలతో పాండవులను ఓడగొట్టాలని నిర్ణయించుకుంటారు. "మాయా జూదము" గురించి ధర్మ రాజుకు తెలుసు. శకుని "మాయలు" చేస్తాడని. కానీ రాజధర్మమును అనుసరించి జూదమును ఆడటానికి ఒప్పుకుంటాడు. శకుని మాయల ముందు ధర్మరాజు ఒక్కొక్కటిగా ధనము, రాజ్యము, నలుగురు సోదరులను, స్వయం గా తను అంతిమంగా ద్రౌపదిని కూడా జూదంలో ఒడ్డుతాడు. ఈ సంఘటనతో మొత్తం కురువంశం రెండు భాగాలుగా విడగొట్టబడింది. ఇప్పుడు కేవలం "హస్తినాపురం" సామ్రాజ్యపు వివాదం కాదు. కానీ ఆత్మగౌరవం, ప్రతీకారం, ధర్మాధర్మముల స్థాపన. ఇక్కడి నుండే మహా భారతం యొక్క మహా యుద్ధము ప్రారంభమైందని చెప్పాలి.

### ఏడవ సంఘటన

ద్రౌపది వస్త్రాపహరణము మాయా జూదంలో పాండవులు సర్వం కోల్పోయిన అనంతరం దుర్యోదనుడి ఆదేశానుసారం దుశ్శాసనుడు పాంచాలిని నిండు సభలో జుట్టుపట్టుకొని లాక్కొని వస్తాడు. అక్కడ భీష్ముడు, ద్రోణుడు, విదురుడు కృపాచార్యుడు, దృతరాష్ట్రుడు, కర్ణుడు మొదలైనవారు ఆసీనులై వుండగా వారి సమక్షంలోనే కుల వధువైన ద్రౌపదిని వస్త్రాపహరణం గావించాల్సిందిగా ఆదేశిస్తాడు. ఈ సంఘటనను ఊహించని పెద్దలు అందరూ దుర్యోధనుడి ముందు మౌనంగానే ఉండిపోతారు. దుశ్శాసనుడు అన్న దుర్యోధనుడి ఆదేశానుసారం ద్రౌపది చీరల్ని లాగటం ప్రారంభిస్తాడు. ఆ సమయంలో ద్రౌపది శ్రీకృష్ణుడిని భక్తితో తల్చుకోవటం మూలంగా శ్రీకృష్ణుడు ద్రౌపదిని వస్త్రాపహరణం నుండి కాపాడుతాడు. ఈ సంఘటన వల్ల దుశ్శాసనుడు అలసిపోయాడు. కానీ సఫలం కాలేకపోయాడు. ఈ సమయంలోనే భీముడు దుశ్శానుడి రక్తం తాగుతాను అని "శపదం" చేస్తాడు. అలాగే దుర్యోధనుడి తొడల్ని ఛేదిస్తానని ప్రతిన భూనుతాడు. అలాగే ద్రౌపది కూడా దుశ్శాసనుడి అంతం వరకు తన "జుట్టు" ముడుచుకోకుండా ఇలాగే ఉంచుతానని "ప్రతిజ్ఞ" చేస్తుంది. ఈ సంఘటనతో పాండవులలో ప్రతీకారాగ్ని పెరిగి పోయిందని చెప్పవచ్చును. ఇక మహా భారతం దాదాపుగా నిశ్చయమైపోయింది.



### ఎనిమిదవ సంఘటన

శ్రీ కృష్ణుడి రాయభారము మాయా జూదంలో ఓడిన పాండవులు పదమూడు సం.రాలు "అరణ్యవాసం" ఒక సంవత్సరము "అజ్ఞాతవాసం" చేయాలని ఆదేశిస్తారు కురు సభలోని పెద్దలు దాని ప్రకారం వారి శిక్షా కాలం పూర్తైన తరువాత వారి రాజ్యాన్ని తిరిగి ఇవ్వమని శ్రీకృష్ణుడిని రాయభారిగా హస్తినాపురం పంపిస్తారు. అందుకు ఒప్పుకోని దుర్యోధనుడి ముందు కురుక్షేత్ర యుద్ధాన్ని నివారించదానికి పాండవులకు కనీసం "ఐదు ఊర్లు" ఇవ్వమని సలహా ఇస్తాడు. దానికి ఒప్పుకోని దుర్యోధనుడు రాయభారిగా వచ్చిన శ్రీకృష్ణుడిని కూడా బంధించి అవమానిస్తాడు. ఐదు ఊర్లు కాదు కదా "సూది" మొన సందు అంత స్థలం కూడా ఇవ్వనని మొండికేస్తాడు. కురుసభలో కృష్ణుడికి జరిగిన అవమానంతో అందురు నిశ్చేష్ఠులౌతారు. రాబోయే యుద్ధాన్ని నివారించి లక్షల మంది మరణించకుండా నివారించవచ్చునని స్వయంగా శ్రీకృష్ణుడు నిండు సభలో సూచించినా అహంకారముతో కళ్ళు మూసుకుపోయిన దుర్యోధనుడు అందుకు ససేమిరా అంటాడు. కురుసభలో అందరికి శ్రీకృష్ణుడు తన "దివ్య రూపాన్ని" ప్రదర్శిస్తాడు. దానిని చూసిన వారందరు స్తబ్దుగా వుండిపోయారు. ఇదే మహా భారతం యొక్క చివరి శాంతి ప్రస్తావన. కానీ ఇది కూడా విఫలం ఐనది. దీనివల్ల స్పష్టమైనది ఏమిటంటే రాబోయే యుద్ధాన్ని ఎవ్వరూ నివారించలేరు. ఇక "కురుక్షేత్ర యుద్ధం" ఇప్పుడు సమయం కోసం నిరీక్షిస్తుంది.

### తొమ్మిదవ సంఘటన

దుర్యోధనుడి ఐదు గ్రామాల దానం విముఖత. ఈ సంఘటనతో ఇటు పాండవులకు, అటు కౌరవ పక్షానికి రెండు వైపుల యుద్ధం దాదాపు ఖాయమైందని సంకేతాలు వెలువడ్డాయి. ఇరుపక్షాలు యుద్ధ వ్యూహాల్లో నిమగ్నమై ఏర్పాట్లు చేయటం ప్రారంభిస్తారు. అందులో భాగంగానే నారాయణ సైన్యం దుర్యోధనుడు, స్వయంగా శ్రీకృష్ణుడు పాండవుల వైపు ఉండటానికి (షరతుల ప్రకారం ఆయుధం పట్టనని) అంగీకరిస్తాడు. కురుక్షేత్ర యుద్ధానికి ఈ సంఘటన బీజం వేసిందని చెప్పాలి.

### పదవ సంఘటన

కర్ణుడికి తన జన్మ రహస్యం ఆలస్యంగా తెలియడం వల్ల అప్పటికే జరగాల్సిన నష్టం జరిగిపోయింది. సరిగ్గా కురుక్షేత్ర యుద్ధం ప్రారంభానికి ముందు శ్రీకృష్ణుడు రాయబారిగా వచ్చినప్పుడు కర్ణుడికి తన జన్మ రహస్యం గురించి చెప్తాడు. అలాగే తన తల్లి కుంతిదేవి కూడా తన సోదరులు ఐదురుగికి అండగా ఉండమని సూచిస్తుంది. కానీ ఇచ్చిన మాట ప్రకారం కర్ణుడు పాండవులలో ఒక్క అర్జునుడిని తప్పా ఎవరిని సంహరించనని శపథం చెస్తాడు. ఈ సంఘటనతో కర్ణుడు పూర్తిగా కరిగిపోతాడు. ఇంత కాలం తన "జన్మ" గురించి తెలియని కర్ణుడికి వాస్తవం తెలిసేటప్పటికి చేష్టలుడిగి ఏమీ చెయ్యలేని నిస్సహాయ స్థితిలోకి నెట్టివేయబడతాడు. కొద్ది రోజుల్లో జరుగకపోయే కురుక్షేత్ర యుద్ధానికి ముందు కర్ణుడు ధర్మ సంకటంలో పడతాడు. ఒక వైపు సోదరులు మరో వైపు ప్రాణ మిత్రుడు ఎవరిని ఒదులుకోవాలో తెలియని స్థితిలో చివరికి దుర్యోధనుడి పక్షం నిలబడతాడు. దుర్యోధనుడి వల్ల లభించిన "రాజ్యము, గౌరవము" మొదలైనవన్నీ కర్ణుడిని సంకటంలోకి నెట్టివేస్తాయి. తన తల్లి కుంతికి ఇచిన మాట ప్రకారం రాబోయే కురుక్షేత్రానికి నిర్ణాయకమైన "మలుపు" తిరిగిందని చెప్పాలి. ఒకవేళ కర్ణుడికి తన జన్మ వృత్తాంతము బాల్యంలోనే తెలిస్తే మహాభారత యొక్క స్వరూపం మారేదని చెప్పొచ్చు. కానీ ఎప్పుడైతే ఈ రహస్యము కర్ణుడి ముందుకు వచ్చిందో అప్పటికే మహాభారత యుద్ధం దాదాపుగా ఖాయమైపోయింది.

### పదకొండవ సంఘటన

దుర్యోధనుడి "అహంకారము" మహా భారతం సంఘటనల వెనుక చాలా కారణాలు ఉన్నప్పటికీ కురుక్షేత్ర యుద్ధానికి కర్త, కర్మ, క్రియ మొత్తం బాధ్యుడిగా దుర్యోధనుడినే భావించాలి. దుర్యోధనుడి అహంకారం వల్ల భవిష్యత్తులో జరుగబోయే పరిణామాలు వేదవ్యాసుడు, భీష్ముడు అలాగే విధురుడు హెచ్చరించినా, గురుద్రోణుడు మందలించినా స్వయంగా తన తల్లి "గాంధారి" నియంత్రించాలని చూసినా, చివరగా స్వయంగా శ్రీకృష్ణుడు శాంతి ప్రస్తావన తెచ్చినా తన అహంకారముతో ఒప్పుకోకపోవడం వల్ల అది కురుక్షేత్రానికి దారి తీసింది. దుర్యోధనుడి మనసులో పుట్టిన/జనించిన అసూయతో ఎట్టి పరిస్థితుల్లో పాండవులకు అధికారం దక్కకూడదని అహంకారపూరిత ఆలోచన చివరికి "ఐదు ఊర్లు" ఇచ్చినా కురుక్షేత్రం జరగకపోయేది. ఫలితంగా ప్రాణ నష్టం, ఆస్తి నష్టం నివారింపబడేది. కానీ దానికి ఒప్పుకోలేదు దుర్యోధనుడు. ఫలితంగా మొత్తం ఆర్యావర్తనం అంధకారంలోకి నెట్టివేయబడింది. చివరికి యుద్ధం వల్ల లక్షల మంది యోధులు, మహా మాహా సారధులు, అలాగే కురువంశం పరిసమాప్తమయింది. అందుకే మహా భారతం వల్ల మనం ఏం తెలుసుకోవచ్చు అనేది, ఎప్పుడైతే మనిషి తన అహంకారమును వదిలిపెట్టక తన వివేకాన్ని, విచక్షణను, విజ్ఞానాన్ని ఉపయోగించుకోలేడో స్వయంగా పతనం వైపు వెళ్తాడనేది దాని సారాంశం. మిత్రలారా పైన చేసిన 11 కారణాలు ఏవి జరగకపోయినా కురుక్షేత్ర యుద్ధం నివారింపబడేదని మీకనిపిస్తుందా?

కురుక్షేత్ర యుద్ధం ముగిసిన తరువాత బలరాముడు తన సోదరుడు ఐన శ్రీకృష్ణుడిని సోదరా రాబోయే తరాలు ఈ కురుక్షేత్ర యుద్ధం వల్ల ఏం నేర్చుకుంటారని ప్రశ్నించగా. శ్రీకృష్ణుడు బలరాముడితో ధర్మమే గెలుస్తుంది కానీ ఆలస్యం అవుతుంది. దుర్యోధనుడి లోభం, అహంకారం, అసూయ, శకుని కుట్ర వల్ల పెద్ద యుద్ధానికి దారి తీసింది. మనిషి తన కర్తవ్యాన్ని ఫలితం ఆశించకుండా చేయాలని గీత ద్వారా అర్జునుడికి తెలిసిందని ఇది రాబోయే తరాలకు కూడా వర్తిస్తుంది. కాలం/విధి ఎవ్వరిని వదలదు, అంతిమంగా ప్రకృతి తన సమతౌల్యాన్ని కాపాడుకోవటంలో కాలాన్ని అనుసరిస్తుంది. పిల్లలు చేస్తున్నది సరైనదేనా అన్న పర్యవేక్షణ పెద్దలు చేయకపోతే ఇలాంటి యుద్ధాలే జరుగుతాయి. కళ్ళు లేని దృతరాష్ట్రుడు దుర్యోధనుడు ఏం చేస్తున్నాడో గ్రహించలేక పుత్ర వ్యామోహం వల్ల అశ్రద్ధ చేస్తాడు. కల్లుండి భర్తను ఆదర్శంగా తీసుకొని గాంధారి చివర వరకు మౌనం వహించటం రెండవ తప్పు. ఇది రాబోయే తరాలు గ్రహించాలి. కర్ణుడు, భీష్ముడు ద్రోణుడు లాంటి వారిని నమ్ముకొని మితిమీరిన నమ్మకంతో పాండవులతో యుద్ధానికి "సై" అంటాడు యువ రాజు. తన శక్తి మీద సామర్థ్యం మీద నమ్మకం ఉంచుకోవాలి కదా కానీ ఇతరులపై ఆదారపడకూడదని ఈ యుద్ధం తెలియజేసింది. ఇది కూడా గమనించాలి. రాబోయే తరాల వారు మహా భారతం మనకు ఇచ్చే అసలు సందేశం. "యుద్ధం గెలవడం కాదు, నీలోని కౌరవుడిని గెలవడం ముఖ్యం" కాదంటారా?


డా.మహ్మద్ హాసన్
అసిస్టెంట్ ప్రొఫెసర్
వ్యక్తిత్వ వికాస నిపుణులు
సెల్:9908059234


# స్నేహం - జీవితానికి వెలుగునిచ్చే అమూల్యమైన బంధం

మనిషి జీవితంలో కుటుంబ సభ్యుల తర్వాత అత్యంత విలువైన బంధం స్నేహం. రక్త సంబంధం లేకపోయినా, ప్రేమ, నమ్మకం, పరస్పర గౌరవం, సహకారం అనే పునాదులపై నిలిచే పవిత్రమైన అనుబంధమే స్నేహం. కష్టసుఖాల్లో తోడుగా నిలిచి, మన జీవితానికి దిశానిర్దేశం చేసే నిజమైన స్నేహితుడు ఒక వరం. అలాంటి స్నేహ బంధాన్ని గుర్తు చేసుకోవడానికి, స్నేహితుల పట్ల కృతజ్ఞతను తెలియజేయడానికి ప్రతి సంవత్సరం ఆగస్టు మొదటి ఆదివారం "స్నేహితుల దినోత్సవం" గా జరుపుకుంటారు.

### స్నేహం యొక్క ప్రాముఖ్యత

స్నేహం అనేది కేవలం కలిసి నవ్వుకోవడం మాత్రమే కాదు. బాధలో భరోసా ఇవ్వడం, తప్పు చేస్తే సరిదిద్దడం, విజయాన్ని చూసి హృదయపూర్వకంగా ఆనందించడం, అపజయంలో ధైర్యం చెప్పడం నిజమైన స్నేహం లక్షణాలు. మనసులోని మాటలను సంకోచం లేకుండా చెప్పుకునే వ్యక్తే నిజమైన స్నేహితుడు. ఒక మంచి స్నేహితుడు మనలోని మంచి లక్షణాలను వెలికితీస్తాడు. మన ఆలోచనలకు పదును పెడతాడు. సరైన నిర్ణయాలు తీసుకునేలా ప్రోత్సహిస్తాడు. అందుకే "వంద మంది పరిచయస్తుల కంటే ఒక నిజమైన స్నేహితుడు గొప్పవాడు" అని పెద్దలు చెబుతారు.

### స్నేహితుల దినోత్సవం చరిత్ర

స్నేహితుల మధ్య అనుబంధాన్ని మరింత బలోపేతం చేయాలనే ఉద్దేశంతో స్నేహితుల దినోత్సవాన్ని జరుపుకోవడం ప్రారంభమైంది. కాలక్రమేణా ఇది ప్రపంచవ్యాప్తంగా విస్తరించింది. అనేక దేశాల్లో ఆగస్టు మొదటి ఆదివారం ఈ దినోత్సవాన్ని జరుపుకుంటారు. ప్రపంచవ్యాప్తంగా స్నేహానికి ఉన్న విలువను గుర్తించిన 2011లో జూలై 30ను "అంతర్జాతీయ స్నేహ దినోత్సవం"గా ప్రకటించింది. అయితే భారత్‌తో పాటు అనేక దేశాల్లో ఇప్పటికీ ఆగస్టు మొదటి ఆదివారమే స్నేహితుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించడం ఆనవాయితీగా కొనసాగుతోంది.

### స్నేహితుల పాత్ర

విద్యార్థి జీవితంలో స్నేహితులు చదువులో ప్రోత్సాహం అందిస్తారు. ఉద్యోగ జీవితంలో మానసిక ఒత్తిడిని తగ్గిస్తారు. కుటుంబ సమస్యలు వచ్చినప్పుడు ధైర్యం చెబుతారు. సమాజంలో మంచి విలువలను పెంపొందించడంలో కూడా స్నేహితుల పాత్ర గొప్పది. స్నేహితుల వల్ల మనలో నాయకత్వ లక్షణాలు, సహనం, సహకార భావం, బాధ్యత, పరస్పర గౌరవం వంటి గుణాలు పెరుగుతాయి. మంచి స్నేహం వ్యక్తిత్వ వికాసానికి బలమైన పునాది అవుతుంది.



### డిజిటల్ యుగంలో స్నేహం

సాంకేతిక పరిజ్ఞానం అభివృద్ధి చెందడంతో ప్రపంచం చిన్నదైంది. సోషల్ మీడియా ద్వారా వేలాది మంది పరిచయం అవుతున్నారు. అయితే నిజమైన స్నేహం కేవలం "లైక్"లు, "ఫాలో"లు, సందేశాలతో మాత్రమే ఏర్పడదు. పరస్పర నమ్మకం, ఆప్యాయత, ఆచరణలో సహకారం ఉన్నప్పుడే ఆ బంధం నిజమైన స్నేహంగా నిలుస్తుంది. ఈ రోజున స్నేహితులు ఒకరినొకరు కలిసి శుభాకాంక్షలు చెప్పుకుంటారు. స్నేహ బంధానికి గుర్తుగా ఫ్రెండ్‌షిప్ బ్యాండ్లు కట్టుకుంటారు. బహుమతులు ఇచ్చిపుచ్చుకుంటారు. కలిసి సమయం గడుపుతారు. ముఖ్యంగా చాలా కాలంగా కలవని స్నేహితులను గుర్తు చేసుకొని పలకరించడం ఈ దినోత్సవానికి మరింత అర్థాన్ని ఇస్తుంది.

అంతకంటే ముఖ్యంగా, కష్టాల్లో ఉన్న స్నేహితుడికి తోడుగా నిలబడటం, అవసరమైన సహాయం చేయడం, పరస్పర విశ్వాసాన్ని కాపాడుకోవడం ఈ దినోత్సవం ఇచ్చే గొప్ప సందేశం. స్నేహం అనేది జీవిత ప్రయాణంలో మనకు లభించే అత్యంత విలువైన సంపద. ధనం, పదవి, ఆస్తులు కాలంతో మారిపోవచ్చు. కానీ నిజమైన స్నేహం జీవితాంతం మన వెంట ఉంటుంది. మన ఆనందాన్ని రెట్టింపు చేసి, బాధను సగం చేసే శక్తి స్నేహానికి ఉంది. అందుకే ప్రతి ఒక్కరూ మంచి స్నేహితులను సంపాదించుకోవడమే కాకుండా, తాము ఒక మంచి స్నేహితుడిగా నిలవడానికి కృషి చేయాలి.


ఆళవందార్ వేణు మాధవ్
హైదరాబాద్, 8686051752

సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
ఆదివారం 02.08.2026
www.mudranews.in | @mudranews



**చేపలు :**
గుండె, మెదడు ఆరోగ్యానికి మేలుచే పల్లోని ఒమేగా-3 ఫ్యాటీ యాసిడ్లు చెడు కొలెస్ట్రాల్‌ను తగ్గించి గుండెను కాపాడతాయి. మెదడు పనితీరును మెరుగుపర చడంలో కూడా సహాయపడతాయి.



# ప్రాథమిక విద్య బంగారు భవిష్యత్ కు బాట

**పీయేసీ ఛైర్మన్ అరికపూడి గాంధీ**

**ముద్ర, శేరిలింగంపల్లి :** ప్రాథమిక విద్య విద్యార్థుల భవిష్యత్ కు బంగారు బాటలు వేస్తుందని పీయేసీ ఛైర్మన్, శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ అభిప్రాయ పడ్డారు. మియాపూర్ డివిజన్ పరిధిలోని న్యూ కాలనీ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో సాఫ్ట్వేర్ సంస్థ సీఎస్ఆర్ నిధులతో నూతనంగా నిర్మించిన రెండు అదనపు తరగతి గదుల భవనాన్ని తాజా మాజీ కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్, సాఫ్ట్వేర్ సంస్థ ప్రతినిధులు, ఉపాధ్యాయులు, విద్యార్థులతో కలిసి ముఖ్య అతిథిగా పాల్గొని ప్రారంభించిన పీయేసీ ఛైర్మన్ అరెకపూడి గాంధీ.ఈ సందర్భంగా ఛైర్మన్ గాంధీ మాట్లాడుతూ సాఫ్ట్వేర్ సంస్థ సీఎస్ఆర్ నిధులతో నిర్మించిన తరగతి గదులను ప్రారంభించుకోవడం చాలా



సంతోషకరమైన విషయం, ఇటువంటి కార్యక్రమాలు విద్యార్థుల బంగారు భవిష్యత్తుకు పునాది లాంటిది ప్రాథమిక విద్య అని అన్నారు. మంచిగా చదువుకొని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఛైర్మన్ గాంధీ విద్యార్థులకు సూచించారు. అన్ని హంగులతో, సకల సౌకర్యాలతో, పిల్లలకు ప్రశాంతమైన వాతావరణంలో చదువుకునే విధంగా నిర్మించడం వల్ల సాఫ్ట్ వేర్ సంస్థ ఎంతో మందికి ఆదర్శంగా నిలిచిందని, సామాజిక బాధ్యత గా ప్రతి ఒక్కరూ సమాజం కోసం సేవ చేయాలని, పిల్లలు చక్కగా చదువుకొని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని, తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు, సమాజానికి మంచిపేరు తేవాలన్నారు. మియాపూర్ పరిధిలో 10 ఎకరాల విస్తీర్ణంలో 200 కోట్ల రూపాయలతో ఇంటిగ్రేటెడ్ యంగ్ ఇండియన్ పాఠశాలకు ఇటీవలే శంకుస్థాపన చేసుకున్నామని, త్వరలోనే పనులు ప్రారంభిస్తామన్నారు. కొండాపూర్ మరియు చందానగర్ లో కోర్ అర్బన్ పాఠ శాలలను ఏర్పాటు చేయడంతో పాటు అన్ని ప్రభుత్వ పాఠశాలలను ప్రత్యేక హంగులతో, సకల సౌకర్యాలతో తీర్చిదిద్దుతామని ఛైర్మన్ గాంధీ హామీ ఇచ్చారు. సాఫ్ట్వేర్ సంస్థ ప్రతినిధులు కిరణ్, ఉషారాణి, భార్గవి, పవన్, తేజ్ కుమార్, నిర్మల, హరి చైతన్య, మంజుల, శ్రీకాంత్, శ్రీనివాసరావు, నికిత, సురేంద్ర, చిరంజీవి, మరియు నాయకులు ప్రతాప్ రెడ్డి, ఉదయ్ కిరణ్, రవిచంద్ర రెడ్డి, అరుణ ఉపాధ్యాయులు, విద్యార్థులు, కాలనీ వాసులు పాల్గొన్నారు.

# అంబీర్ చెరువులో ఎస్టీపీ నిర్మాణాన్ని అడ్డుకుని తీరుతాం

**ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి**

**ముద్ర, శేరిలింగంపల్లి:** నియోజకవర్గ పరిధిలోని హైదర్ నగర్ డివిజన్ అంబీర్ చెరువులో ప్రభుత్వం నిర్మించే ఎస్టీపీని అడ్డుకుని తీరుతామని చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి కాలనీవాసులకు హామీ ఇచ్చారు. ఆదిత్యనగర్ కాలనీకి ఆనుకొని ఉన్న అంబీర్ చెరువులో చట్ట విరుద్ధంగా ఎఫ్టీఎల్ ప్రాంతంలో నిర్మిస్తున్న ఎస్టీపీ ప్లాంట్ ను వెంటనే నిలిపివేయాలి రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కాలనీ వాసుల ఆహ్వానం మేరకు ఆదిత్యనగర్ లో కాలనీ అసోసియేషన్ అధ్యక్షుడు వెంకటరెడ్డి అధ్యక్షతన కాలనీ వాసుల ఆత్మీయ సమ్మేళనం జరిగింది. ఈ సందర్భంగా ఎంపీ కొండావిశ్వేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ కాలనీ వాసులకు అండగా నిలబడి ఎస్టీపీ నిర్మాణాన్ని అడ్డుకుంటామని హామీ ఇచ్చారు. భారాస, కాంగ్రెస్ పార్టీ నాయకులు 250 ఎకరాల విస్తీర్ణం గల అంబీర్ చెరువును కబ్జా చేస్తూ చేస్తూ




150 ఎకరాలకు మిగిల్చారని ఆరోపించారు. కాలనీ వాసుల ఆరోగ్యాన్ని కాపాడేందుకు వారి పక్షాన నిలబడి పోరాడ తామన్నారు. భాజాపా రాష్ట్ర అధికార ప్రతినిధి మారబోయిన రవికుమార్ యాదవ్ మాట్లాడుతూ సుందరీకరణ పేరుతో కొంతమంది రాజకీయ నాయకులు చెరువులను కబ్జా చేసి సొమ్ము చేసుకుంటున్నారని, ఆదిత్య నగర్ కాలనీ ప్రక్కనే ఉన్న అంబీర్ చెరువులో ఎఫ్టీఎల్ పరిధిలో ఎస్టీపీ నిర్మించడం వలన ఉద్భవించే ఆరోగ్య సమస్యలను దృష్టిలో పెట్టుకొని స్థానిక ఎమ్మెల్యేను సంప్రదించినా ఫలితం లేకపోవడంతో ఎస్టీపీ నిర్మించడాన్ని వ్యతిరేకిస్తూ కోర్టును ఆశ్రయించాల్సి వచ్చిందని కాలనీ వాసులు తెలపడం రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాన్ని తెలియ చేస్తుందని రవికుమార్ ఆరోపించారు. కాలనీ వాసులు ఎదుర్కొంటున్న ఈ సమస్య మా సమస్యగా భావించి ఎప్పటి కప్పుడు స్థానిక ఎంపీ కొండ విశ్వేశ్వర్ రెడ్డితో చర్చించి సమస్య పరిష్కారానికి మా వంతు కృషిగా పోరాటం కొనసాగిస్తామని రవికుమార్ యాదవ్ కాలనీ వాసులకు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కాలనీ సంక్షేమ సంఘం జనరల్ సెక్రెటరీ శ్రీనివా సరెడ్డి, భరత్ కుమార్, భారతీయ జనతా పార్టీ నాయకులు రవీంద్రరావు, సీతారా మరాజు, కృష్ణంరాజు, కేశవులు అరుణ్ కుమార్, దుర్గాప్రసాద్, నర్సింగ్ రావు, నర్సింగ్ యాదవ్, వెంకటస్వామి రెడ్డి, రాయల్, చాంద్, సైదమ్మ నర్సింగ్ తదితరులు పాల్గొన్నారు.

# ఎస్ఐఆర్ ప్రక్రియ గడువు ఆగస్టు 10 వరకు పొడిగింపు

**అదనపు సమయాన్ని ప్రక్రియ నాణ్యత పెంపునకు వినియోగించాలి**
**భారత ఎన్నికల సంఘం కార్యదర్శి నవీన్ కుమార్**
**ఎస్ఐఆర్ అమలుపై రంగారెడ్డి జిల్లా అధికారులతో సమీక్ష సమావేశం**
**అనంతరం క్షేత్రస్థాయిలో పరిశీలన**

**ముద్ర ప్రతినిధి, ఉమ్మడి రంగారెడ్డి:** భారత ఎన్నికల సంఘం ప్రత్యేక ఓటరు జాబితా సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమానికి ఆగస్టు 10 వరకు గడువు పొడిగించిన నేపథ్యంలో, లభించిన అదనపు సమయాన్ని ప్రక్రియ నాణ్యతను మరింత మెరుగుపర్చేందుకు వినియోగించాలని భారత ఎన్నికల సంఘం కార్యదర్శి నవీన్ కుమార్ అధికారులను ఆదేశించారు.శనివారం రంగారెడ్డి జిల్లా కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్, ఎన్నికల అధికారి సి. నారాయణరెడ్డి, అదనపు కలెక్టర్లు కె. కిరణ్మయి, చంద్రారెడ్డితో కలిసి ఎస్ఐఆర్ అమలుపై సమీక్ష నిర్వహించారు.ఈ సందర్భంగా నవీన్ కుమార్ మాట్లాడుతూ, జిల్లాలో ఇప్పటి




వరకు చేపట్టిన ఓటరు అవగాహన కార్యక్రమాలు, ఫారం ఫిల్లింగ్ మేళాలు ప్రజల్లో ఎన్నికల ప్రక్రియపై విశ్వాసాన్ని పెంచాయని అభినందించారు. ఇప్పటికే డిజిటైజ్ చేసిన ఎన్యూమరేషన్ ఫారాలను బీఎల్‌వోలు మరోసారి క్షుణ్ణంగా పరిశీలించి వివరాలు, ఫోటోలు, పత్రాల అప్‌లోడ్‌లో ఎలాంటి లోపాలు లేకుండా చూసుకోవాలని సూచించారు. ఈఆర్‌వోలు, ఏఈఆర్‌వోలు ఆకస్మిక తనిఖీలు నిర్వహించి నాణ్యతను నిర్ధారించాలని ఆదేశించారు.పోలింగ్ కేంద్రాల హేతుబద్ధీకరణను జాగ్రత్తగా చేపట్టి, ప్రభుత్వ భవనాలకే ప్రాధాన్యం ఇవ్వాలని, మరణించిన, చిరునామా మార్చుకున్న లేదా గుర్తించలేని ఓటర్ల వివరాలను క్షేత్రస్థాయిలో మరోసారి ధృవీకరించాలని సూచించారు. బీఎల్‌వోలు ప్రజలకు అందుబాటులో ఉండి అవసరమైన దరఖాస్తులు స్వీకరిస్తూ ఎన్నికల ప్రక్రియపై స్పష్టమైన అవగాహన కల్పించాలని చెప్పారు.జిల్లా కలెక్టర్ సి. నారాయణరెడ్డి మాట్లాడుతూ, ఎన్నికల సంఘం మార్గదర్శకాల మేరకు జిల్లాలో ఎస్ఐఆర్ కార్యక్రమాన్ని పారదర్శకంగా అమలు చేస్తున్నామని తెలిపారు. జిల్లాలో 3,501 పోలింగ్ కేంద్రాలు, 36,99,743 మంది ఓటర్లు ఉన్నారని, ప్రస్తుతం 63.53 శాతం మ్యాపింగ్ పూర్తైందని వెల్లడించారు. పట్టణ ప్రాంతాల్లో పెండింగ్ మ్యాపింగ్, డూప్లికేట్, నో మ్యాపింగ్ కేసులపై ప్రత్యేక దృష్టి సారించినట్లు తెలిపారు.ఆగస్టు 10 వరకు గడువు పొడిగించడంతో మిగిలిన ప్రక్రియను మరింత నాణ్యతతో పూర్తి చేస్తామని, బీఎల్‌వోలు, బీఎల్ఏలతో కలిసి పెండింగ్ కేసులను ధృవీకరించి, రాజకీయ పార్టీలతో సమన్వయం కొనసాగిస్తామని చెప్పారు. ఓటర్లకు మరింత సౌకర్యవంతమైన పోలింగ్ కేంద్రాల ఏర్పాటు లక్ష్యంగా చర్యలు తీసుకుంటున్నామని వివరించారు.సమీక్ష అనంతరం భారత ఎన్నికల సంఘం కార్యదర్శి నవీన్ కుమార్ కొంగర, బొంగులూరు, ఎల్బీనగర్ ప్రాంతాల్లో కొనసాగుతున్న ఎస్ఐఆర్ ప్రక్రియను ప్రత్యక్షంగా పరిశీలించి బీఎల్‌వోలతో మాట్లాడి పనితీరును సమీక్షించారు. అదనపు కలెక్టర్లు కె. కిరణ్మయి, చంద్రారెడ్డి, జోనల్ కమిషనర్లు, ఈఆర్‌వోలు, జిల్లా అధికారులు, ఎన్నికల విభాగం, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

# భూ బాధితులకు న్యాయం చేస్తాం

**ఎంపీ ఈటల రాజేందర్ భరోసా**

**ముద్ర, మల్కాజిగిరి:** మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్‌ను శామీర్‌పేట్‌లోని ఆయన నివాసంలో అన్మత్‌నగర్, హయత్‌నగర్ ప్రాంతాలకు చెందిన భూ బాధితులు కలిసి తమ సమస్యలను వివరించారు. సుమారు 50 ఏళ్ల క్రితం అప్పటి ప్రధాని ఇందిరాగాంధీ పేద దళిత కుటుంబాలకు ఒక్కో కుటుంబానికి ఎకరం చొప్పున భూమి కేటాయించారని తెలిపారు. ప్రస్తుతం ఆ భూముల్లో ఇళ్లు నిర్మించుకునేందుకు అనుమతించడం లేదని, సమస్య పరిష్కారం కోసం పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులను ఆశ్రయించినా ఫలితం లేకపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. నివాసం కోసం కనీసం 100 గజాల స్థలాన్ని కేటాయించాలని కోరారు. కుటుంబ సభ్యులు మరణించినప్పుడు మృతదేహాన్ని ఇంటి ముందు ఉంచేందుకు కూడా తగిన స్థలం లేక ఇబ్బందులు పడుతున్నామని పలువురు బాధితులు కన్నీటి పర్యంత మయ్యారు.వారి సమస్యలను ఓపికగా విన్న ఎంపీ సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్యకు పరిష్కారం చూపేందుకు కృషి చేస్తామని, బాధితులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

## 138 ఆలయ కమిటీలకు ఆర్థిక సాయం

**ముద్ర, కూకట్‌పల్లి:** తెలంగాణ రాష్ట్ర ఆషాఢ మాస బోనాల పండుగను పురస్కరించుకుని రాష్ట్ర ప్రభుత్వం మరియు దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో ఆలయాలకు ఆర్థిక సహాయ నిధుల చెక్కుల పంపిణీ కార్యక్రమం కూకట్పల్లి నియోజకవర్గంలోని భరత్ నగర్ శ్రీ హరిహర క్షేత్రం ఆలయ ప్రాంగణంలో నిర్వహించబడింది. ప్రభుత్వ విప్, నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం, కూకట్పల్లి కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్, తెలంగాణ రాష్ట్ర కమ్మ కార్పొరేషన్ లిమిటెడ్ ఛైర్మన్ బండి రమేష్, కూకట్పల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ ఛైర్‌పర్సన్ పుష్పా రెడ్డి ముఖ్య అతిథులుగా విచ్చేశారు. ఈ సందర్భంగా కూకట్పల్లి నియోజకవర్గ పరిధిలోని మొత్తం 138 ఆలయ కమిటీల అధ్యక్షులకు ప్రభుత్వ ఆర్థిక సహాయ నిధుల



చెక్కులను వారు అందజేశారు. ఈ కార్యక్రమంలో కూకట్పల్లి కాంగ్రెస్ ఇన్‌చార్జ్ బండి రమేష్ మాట్లాడుతూ బోనాల పండుగ మన తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు సజీవ ప్రతీక అని అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయత్వంలో రాష్ట్రం అన్ని రంగాల్లో వేగంగా అభివృద్ధి సాధిస్తూ దేశంలోనే ఆదర్శ రాష్ట్రంగా ముందుకు సాగుతోందని కొనియాడారు. రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమం, అభివృద్ధి ఫలాలు ప్రత్యేకించి, రాష్ట్రంలోని ఆలయాల అభివృద్ధికి, మన ఆధ్యాత్మిక సంప్రదాయాల పరిరక్షణకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. నియోజకవర్గంలోని వివిధ ఆలయాల కమిటీల అధ్యక్షులు, కాంగ్రెస్ పార్టీ బ్లాక్ అధ్యక్షులు, డివిజన్ అధ్యక్షులు, సీనియర్ నాయకులు, ప్రజాప్రతినిధులు, పార్టీ కార్యకర్తల పెద్ద సంఖ్యలో భక్తులు హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# అధికారులు బాధ్యతతో పనిచేయాలి

**- మల్కాజిగిరి కమిషనర్ వినయ్**



**ముద్ర, బోడుప్పల్:** ప్రజలకు సౌకర్యాల కల్పనలో అధికారులు బాధ్యతతో వ్యవహరించాలని మల్కాజిగిరి మునిసిపల్ కార్పొరేషన్ కమిషనర్ వినయ్ కృష్ణా రెడ్డి అన్నారు. మల్కాజిగిరి కార్పొరేషన్ పరిధి పదో డివిజన్ బోడుప్పల్ వీరారెడ్డినగర్లో శనివారం ఆయన పర్యటించారు. బోడుప్పల్ డిప్యూటీ కమిషనర్ ఏ.శైలజ, ఇతర అధికారులతో కలిసి పర్యటించిన ఆయన క్షేత్రస్థాయిలో అమలవుతున్న పనుల పురోగతిని పరిశీలించారు. పర్యటనలో భాగంగా కమిషనర్ కాలనీలోని రహదారులు, పారిశుధ్య నిర్వహణ, డ్రైనేజీల పరిస్థితి మరియు పారిశుధ్య కార్యకలాపాలను క్షుణ్ణంగా పరిశీలించారు. ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు, పరిశుభ్రమైన వాతావరణం అందించే దిశగా అవసరమైన చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులకు ఆదేశించారు. రహదారుల మరమ్మతు పనులు, పారిశుధ్య నిర్వహణ, చెత్త సకాలంలో తొలగింపు, డ్రైనేజీల శుభ్రత వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి సారించి, అభివృద్ధి పనులను నాణ్యతతో, వేగవంతంగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.ఈ కార్యక్రమంలో ఇంజినీరింగ్, శానిటేషన్ విభాగాల అధికారులు, మున్సిపల్ సిబ్బంది, ఇతర సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# లంగర్ హౌస్ ఠాణాలో బోనాల ఉత్సవాలు

**ముద్ర ప్రతినిధి, రాజేంద్రనగర్:** పండుగలు, సందర్భాలు లేకుండా నిత్యం బందోబస్తులో నిమగ్నమై ఉండే పోలీసులు అమ్మవారిని కొలుస్తూ భక్తి పారవశ్యం లో మునిగారు. ఆషాడ మాస బోనాల జాతర సందర్భంగా లంగర్ హౌస్ పోలీస్ స్టేషన్లో ఇన్స్పెక్టర్ వెంకటరాములు ఆధ్వర్యంలో బోనాల పూజలు నిర్వహించారు. గోల్కొండ బోనాల సందర్భంగా తొట్టెల ఊరేగింపు ప్రథమ పూజ నిర్వహించే బుజిలి మహంకాళి ఆలయం అమ్మవారి ఉత్సవమూర్తి, ఘటాన్ని లంగర్ హౌస్ పోలీస్ స్టేషన్కు తీసుకువచ్చారు. ఆలయ చైర్మన్ భోగి బాల్ రాజ్ ఆధ్వర్యంలో మధ్యాహ్నం వరకు పోలీస్ స్టేషన్ లో పూజలు నిర్వహించి పోలీసులు మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం ప్రసాద వితరణ



కార్యక్రమం జరిగింది. అయితే బోనాల సందర్భంగా తాము బందోబస్తులోనే ఉంటామని ఇక్కడ అమ్మవారి కి సేవ చేసుకునే అవకాశం కలగడం చాలా సంతోషంగా ఉందని పోలీసు అధికారులు సిబ్బంది ఆనందం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కన్వీనర్ వరదరాజు, ట్రెజరర్ రాజేష్, సిబ్బంది పాల్గొన్నారు.

# సీనియర్ సిటిజన్స్ పార్క్ అభివృద్ధికి కృషి



**ముద్ర, కూకట్‌పల్లి :** కేపీహెచ్‌బీ 6వ ఫేజ్ సీనియర్ సిటిజన్స్ పార్క్ అభివృద్ధి కోసం మల్కాజ్‌గిరి ఎంపీ ఈటెల రాజేందర్‌కు సీనియర్ సిటిజన్స్ కౌన్సిల్ ప్రతినిధులు వినతిపత్రం అందజేశారు. రాష్ట్ర బీజేపీ సీనియర్ నాయకులు వడ్డేపల్లి రాజేశ్వరరావు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ప్రీతం రెడ్డి, గురు ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.పార్కులో గ్రౌండ్, ప్రహరీ గోడ ఎత్తు పెంపు, బెంచీలు, మొక్కలు, విద్యుత్ దీపాల ఏర్పాటు వంటి సమస్యలను పరిష్కరించాలని కోరగా.. ఎంపీ ఈటెల సానుకూలంగా స్పందించి అధికారులతో మాట్లాడి తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. పలువురు బీజేపీ నాయకులు, కౌన్సిల్ సభ్యులు పాల్గొన్నారు.

# సంస్కృతిలో ఫ్రెండ్‌షిప్ డే మోడల్ బోనాలు



**ముద్ర, దేవరకొండ:** కొండమల్లేపల్లి పట్టణ కేంద్రంలోని సంస్కృతి ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో శనివారం విద్యార్థులు ఫ్రెండ్ షిప్ డే, తెలంగాణ సంస్కృతి సాంప్రదాయాలకు ప్రతీకైన మోడల్ బోనాల వేడుకలు ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని సాంస్కృతిక కార్యక్రమాలతో పాఠశాల ప్రాంగణాన్ని అలరించారు. విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలకు పాఠశాల డైరెక్టర్ కట్టా వెంకట్ రెడ్డి, కరస్పాండెంట్ కట్టా శిరీష రెడ్డి, ప్రిన్సిపల్ సుదర్శన్ రెడ్డిలు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. విద్యార్థులు మోడల్ బోనాల పండుగ సందర్భంగా సంప్రదాయ నృత్యాలు, పాటలు ప్రదర్శించారు. ఫ్రెండ్షిప్ డే సందర్భంగా స్నేహం గొప్పతనాన్ని తెలియజేసే కార్యక్రమాలు నిర్వహించారు. విద్యార్థుల ఉత్సాహం, సాంస్కృతిక ప్రతిభ అందరినీ ఆకట్టుకుంది. ఈ సందర్భంగా పాఠశాల యాజమాన్యం మాట్లాడుతూ విద్యార్థుల్లో సాంస్కృతిక విలువలు, స్నేహభావం, ఐక్యతను పెంపొందించడమే ఈ కార్యక్రమాల ముఖ్య ఉద్దేశమని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల అధ్యాపక బృందం, విద్యార్థుల తల్లిదండ్రులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
ఆదివారం 2.08.2026
www.mudranews.in | @mudranews



### చేపలు తినడం వల్ల ఉపయోగాలు

చేపలతో కంటి చూపు, రోగనిరోధక శక్తికి ఉపయోగం.. విటమిన్-ఎ సమృద్ధిగా ఉండటం వల్ల కంటి ఆరోగ్యం మెరుగుపడుతుంది. లీన్ ప్రొటీన్, ఇతర పోషకాలు రోగనిరోధక శక్తిని పెంచుతాయి.



# కరీంనగర్‌లో గల్లీగల్లీ అభివృద్ధి చేస్తాం

### - కేంద్రమంత్రి బండి సంజయ్



**ముద్ర, కరీంనగర్ :** కరీంనగర్ కార్పొరేషన్ పరిధిలోని ప్రతి గల్లీని అభివృద్ధి చేస్తామని, అందుకోసం కేంద్రం నుంచి మరిన్ని నిధులు తీసుకొస్తామని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ తెలిపారు. శనివారం కరీంనగర్ పర్యటనలో భాగంగా మేయర్ కొలగాని శ్రీనివాస్, డిప్యూటీ మేయర్ సునీల్ రావు, మున్సిపల్ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్, స్థానిక ప్రజాప్రతినిధులతో కలిసి పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు నిర్వహించారు.

48వ డివిజన్‌లో రూ.1 కోట్లతో సీసీ రోడ్లు, డ్రెయిన్ పనులకు శంకుస్థాపన చేయగా, 19వ డివిజన్‌లో రేకుర్తి ముదిరాజ్ కాలనీ, లక్ష్మీనరసింహ కాలనీల్లో కలిపి రూ.97 లక్షల వ్యయంతో సీసీ రోడ్లు, పైప్‌లైన్ పనులను ప్రారంభించారు. మొగ్దుంపూర్‌లో రూ.10 లక్షలతో నిర్మించిన మహిళా శక్తి ధరణి గ్రామైఖ్య సంఘ భవనాన్ని, రూ.15 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్లు, డ్రెయిన్‌ను ప్రారంభించారు.

అంతకుముందు చింతకుంటలో నిర్వహించిన వన మహోత్సవం–2026 కార్యక్రమంలో పాల్గొని మొక్కలు నాటారు. అనంతరం మాట్లాడుతూ కరీంనగర్ అభివృద్ధికి కేంద్రం నుంచి భారీగా నిధులు సమీకరిస్తున్నామని తెలిపారు. ఇప్పటికే స్మార్ట్ సిటీ కింద రూ.900 కోట్లు, అమృత్–1, అమృత్–2 పథకాల కింద రూ.279 కోట్లు, అర్బన్ డెవలప్‌మెంట్ ఫండ్ కింద రూ.50 కోట్లు మంజూరయ్యాయని చెప్పారు. తీగలగుట్టపల్లి ఆర్వోబీ కోసం రూ.156 కోట్లు కేటాయించినట్లు గుర్తుచేశారు. తాజాగా రూ.840 కోట్లతో నగరంలో మోడల్ రోడ్లు, స్కైవాక్‌లు, ఫుట్ ఓవర్ బ్రిడ్జిలు, నాన్–మోటరైజ్డ్ ట్రాన్స్‌పోర్ట్ సదుపాయాలు, శివారు ప్రాంతాల్లో సీసీ రోడ్ల నిర్మాణం చేపట్టనున్నట్లు వెల్లడించారు. కరీంనగర్‌ను తెలంగాణలోనే ఆదర్శ నగరంగా తీర్చిదిద్దడమే లక్ష్యమని, పార్లమెంట్ నియోజకవర్గ అభివృద్ధికి ఇప్పటికే రూ.22 వేల కోట్ల విలువైన పనులు చేపట్టామని, త్వరలో మరిన్ని కేంద్ర నిధులు తీసుకొచ్చేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నామని బండి సంజయ్ తెలిపారు.

## కోనేరు లో పడి వ్యక్తి మృతి

**ముద్ర, కోరుట్ల;** కోనేరు లో పడి వ్యక్తి మృతి చెందిన ఘటన మెట్పల్లి పట్టణంలో చోటు చేసుకుంది. స్థానికుల అందించిన సమాచారం టీ ప్రకారం మెట్పల్లి పట్టణం లోని ఇందిరా నగర్ కు చెందిన కాంపెల్లి పోషయ్య 67 అనే వృద్ధుడు పట్టణంలోని చెన్నకేశవ స్వామి ఆలయంలోని కోనేరు లో స్నానం చేయడానికి వెళ్ళి ప్రమాదవశాత్తూ అందులోc పడి మృతి చెందాడు. చూసిన స్థానికులు వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. ఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని బయటకు తీయించారు. అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాసుపత్ర తరలించి కేసు నమోదుచేసి దర్యాప్తు ప్రారంభించినట్లు పోలీసులు వెల్లడించారు.

## ధర్మపురిలో కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ

**ముద్ర, ధర్మపురి :** ధర్మపురి మండలానికి చెందిన కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాల లబ్దిదారులకు తెలంగాణ రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ గారు శనివారం ధర్మపురి క్యాంపు కార్యాలయంలో చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మొత్తం 10 మంది లబ్ధిదారులకు సుమారు రూ.10 లక్షల విలువైన కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను మంత్రి అందజేశారు. రాష్ట్ర ప్రభుత్వం పేద కుటుంబాల ఆడబిడ్డల వివాహాలకు ఆర్థిక భరోసా కల్పించే లక్ష్యంతో ఈ పథకాలను సమర్థవంతంగా అమలు చేస్తోందని మంత్రి పేర్కొన్నారు. అర్హులైన ప్రతి లబ్ధిదారికి ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు అందేలా ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. చెక్కుల పంపిణీ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, అధికారులు, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.



## మంత్రులకు అధికారుల స్వాగతం



**ముద్ర ప్రతినిధి, నిర్మల్:** నిర్మల్ జిల్లా కడెం ప్రాజెక్టు సందర్శన నిమిత్తం జిల్లాకు వచ్చిన రాష్ట్ర నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, రాష్ట్ర కార్మిక, ఉపాధి కల్పన శాఖ మంత్రి వివేక్ వెంకటస్వామిలకు జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా, జిల్లా ఎస్పీ జానకి షర్మిల కలెక్టరేట్ హెలిప్యాడ్ వద్ద పూల మొక్కలు అందజేసి ఘన స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు బి. వెంకటేశ్వర్లు, కిషోర్ కుమార్, అదనపు ఎస్పీ సాయి కిరణ్, వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ హయాంలో నిర్మించిన ప్రాజెక్టుల వల్లే ఇప్పుడు నీళ్లు

### సుడా మాజీ చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి

**ముద్ర, కరీంనగర్ :** కాంగ్రెస్ హయాంలో నిర్మించిన ప్రాజెక్టుల వల్లే ఇప్పుడు నీళ్లు వస్తున్నాయని సుడా మాజీ చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి అన్నారు. స్థానిక ముఖరంపూర్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, వర్షాభావాన్ని ఆసరాగా చేసుకుని మేడిగడ్డ అంశంతో కాంగ్రెస్ ప్రభుత్వాన్ని బద్నాం చేసేందుకు కేటీఆర్, హరీశ్ రావు ప్రయత్నించారని విమర్శించారు. లక్ష కోట్లతో నిర్మించిన మేడిగడ్డ బ్యారేజీ ఆనాడైనా, ఈనాడైనా ఉపయోగపడలేదని ఆరోపించారు. మానేరు డ్యాంలో నీళ్లు లేవంటూ ఎమ్మెల్యే గంగుల కమలాకర్ ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేశారని, కొద్ది రోజుల్లోనే మిడ్ మానేరు నుంచి లోయర్ మానేరు డ్యాంకు నీటిని విడుదల చేస్తారని తెలిపారు. బీఆర్ఎస్ హయాంలో స్మార్ట్ సిటీ పనులు అవినీతిమయంగా జరిగాయని, ఇందిరా చౌక్ సుందరీకరణకు భారీగా ఖర్చు చేయగా, కాంగ్రెస్ ప్రభుత్వం జ్యోతిబా పూలే చౌక్‌ను తక్కువ వ్యయంతో అభివృద్ధి చేసిందని చెప్పారు.

భగత్‌నగర్ ఘటనను రాజకీయంగా ఉపయోగించుకునే ప్రయత్నం చేశారని, అయితే పోలీసులు మూడు రోజుల్లోనే నిందితులను పట్టుకున్నారని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో ప్రజాపాలన సమర్థంగా సాగుతోందని, కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజలు సంతృప్తిగా ఉన్నారని నరేందర్ రెడ్డి అన్నారు.ఈ విలేఖరుల సమావేశంలో గుండాటి శ్రీనివాస్ రెడ్డి,కుర్ర పోచయ్య,గుడిపాటి రమణారెడ్డి,తోట అంజయ్య,బషీర్, భారీ, మాసుం ఖాన్, ఇమ్రాన్,ఖలీల్ తదితరులు పాల్గొన్నారు.




## వాసవి వనిత క్లబ్ ఆధ్వర్యంలో ముందస్తు ఫ్రెండ్షిప్ డే వేడుకలు




**ముద్ర, కోరుట్ల;** కోరుట్ల పట్టణ వాసవి వనిత క్లబ్ ఆధ్వర్యంలో శనివారం రోజు స్థానిక వాసవి కళ్యాణ భవనంలో ముందస్తు ఫ్రెండ్షిప్ డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి మున్సిపల్ ఛైర్పర్సన్ తిరుమల వసంత గంగాధర్ ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా ఆమెను వాసవి వనిత క్లబ్ సభ్యులు శాలువాతో సన్మానించి, ముందస్తు దోస్తుల దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం ఫ్రెండ్షిప్ డే సందర్భంగా కేకు ను కట్ చేసి ఒకరికొకరు తినిపించుకున్నారు. ఆటలు పాటలతో సందడి చేశారు. ఈ కార్యక్రమంలో వాసవి వనిత క్లబ్ మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## ప్రణాళికా బద్ధంగా నీటి నిల్వకు కసరత్తు

### రాష్ట్ర మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, శ్రీధర్ బాబు, వివేక్

**ముద్ర ప్రతినిధి, నిర్మల్:** రాబోయే రోజుల్లో తాగునీరు, సాగునీటి అవసరాలను దృష్టిలో ఉంచుకొని ప్రాజెక్టుల్లో నీటి నిల్వకు కృషి చేయాలని రాష్ట్ర నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి అధికారులను ఆదేశించారు. ఇటీవల కురిసిన భారీ వర్షాల నేపథ్యంలో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, కార్మిక శాఖ మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామిలతో కూడిన మంత్రుల బృందం శనివారం కడెం ప్రాజెక్టును సందర్శించింది. ఈ సందర్భంగా అధికారులు పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా పూర్తి స్థాయి నీటిమట్టం (ఎఫ్ఆర్ఎల్), ప్రస్తుత ఇన్‌ఫ్లో, ఔట్‌ఫ్లో, గేట్ల ద్వారా దిగువకు విడుదల చేస్తున్న నీటి పరిమాణం, ప్రస్తుత పరిస్థితులను మంత్రులకు వివరించారు. భవిష్యత్తులో తాగునీరు, సాగునీటి అవసరాలపై కూడా సమగ్ర సమాచారం అందించారు. అనంతరం మంత్రులు మాట్లాడుతూ ఎల్‌నినో ప్రభావం, భవిష్యత్తు నీటి అవసరాలను దృష్టిలో ఉంచుకొని నీటి నిర్వహణకు శాస్త్రీయ విధానాన్ని అనుసరించాలని సూచించారు. ప్రజలకు తాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కలెక్టర్ భవేష్ మిశ్రా కడెం ప్రాజెక్టు ప్రస్తుత పరిస్థితి, నీటిమట్టం, నీటి నిల్వ సామర్థ్యం, సిల్టేషన్ సమస్యలు, నీటి పారుదల నిర్వహణపై మంత్రులకు వివరించారు. ప్రాజెక్టులో పేరుకుపోయిన పూడిక సమస్యను దశలవారీగా తగ్గించి ప్రాజెక్టు నిల్వ సామర్థ్యాన్ని పెంచేందుకు అవసరమైన సాంకేతిక చర్యలు చేపడుతున్నామన్నారు. ఈ పర్యటనలో ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్, జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్, జిల్లా ఎస్పీ జానకి షర్మిల, అదనపు కలెక్టర్లు బి. వెంకటేశ్వర్లు, కిషోర్ కుమార్, ఏఎస్పీ సాయి కిరణ్, ప్రజాప్రతినిధులు, ఇరిగేషన్ శాఖ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.




## తెలంగాణలో నామినేటెడ్ పోస్టుల భర్తీ ప్రక్రియ ప్రారంభం

ముద్ర, హైదరాబాద్: తెలంగాణలో నామినేటెడ్ పోస్టుల భర్తీ ప్రక్రియ ప్రారంభమైందని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. సీఎం నిర్ణయాలకు అనుగుణంగా నియామకాలు జరుగుతాయన్నారు. ఆశావహులు తమ పేర్లను పీసీసీకి పంపాలని సూచించారు. గాంధీభవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. కార్పొరేషన్ చైర్మన్ల నియామకాలు త్వరలో చేపడతామన్నారు. వివిధ నామినేటెడ్ పోస్టుల భర్తీని దశలవారీగా పూర్తి చేస్తామని, సహకార సంఘాల పాలకవర్గాల పోస్టులను కూడా భర్తీ చేస్తామని పేర్కొన్నారు.



## కరీంనగర్ బిల్డ్ ఎక్స్‌పోకు ఎమ్మెల్యే గంగుల, కొత్త జయపాల్ రెడ్డి హాజరు




**ముద్ర, కరీంనగర్ :** అసోసియేషన్ ఆఫ్ కన్సల్టింగ్ సివిల్ ఇంజనీర్స్ ఇండియా (ACCEI) ఆధ్వర్యంలో కరీంనగర్ అంబేద్కర్ స్టేడియంలో నిర్వహిస్తున్న బిల్డ్ ఎక్స్ పో–2026కు కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్, మైత్రి గ్రూప్ & మైత్రి ఛానల్ చైర్మన్ కొత్త జయపాల్ రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు ఎక్స్ పోలో ఏర్పాటు చేసిన వివిధ స్టాళ్లను సందర్శించి, నిర్మాణ రంగంలో అందుబాటులోకి వస్తున్న అత్యాధునిక సాంకేతికతలు, నూతన నిర్మాణ సామగ్రి, వినూత్న ఉత్పత్తులను పరిశీలించారు. సివిల్ నిర్మాణ రంగం వేగంగా ఆధునీకీకరణ దిశగా అడుగులు వేస్తోందని, ఇటువంటి ప్రదర్శనలు ఇంజనీర్లు, కాంట్రాక్టర్లు, నిర్మాణ రంగానికి ఎంతో ఉపయోగపడతాయని వారు పేర్కొన్నారు.

ఎగ్జిబిషన్ ను సందర్శించిన కొత్త జయపాల్ రెడ్డి మాట్లాడుతూ, నాణ్యత, సాంకేతికత, భద్రతకు ప్రాధాన్యత ఇస్తూ యువ ఇంజనీర్లు నిర్మాణ రంగంలో తమ ప్రతిభను చాటుకోవాలని సూచించారు. ఆధునిక టెక్నాలజీని వినియోగించి దేశ అభివృద్ధిలో భాగస్వాములు కావాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ACCEI ప్రతినిధులు, జిల్లాకు చెందిన ప్రముఖ సివిల్ ఇంజనీర్లు, కాంట్రాక్టర్లు, నిర్మాణ రంగ నిపుణులు, ప్రజాప్రతినిధులు తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. బిల్డ్ ఎక్స్ పోకు నిర్మాణ రంగానికి చెందిన నిపుణులతో పాటు ప్రజల నుంచి కూడా విశేష స్పందన లభించింది.

## అత్యాధునిక టెక్నాలజీతో నాణ్యమైన ఇళ్ల నిర్మాణాలు..

### సివిల్ ఇంజనీరింగ్ రంగానికి భవిష్యత్తులో భారీ డిమాండ్: మాజీ మంత్రి గంగుల




**ముద్ర, కరీంనగర్ :** రీంనగర్‌లో జరిగిన బిల్డ్ ఎక్స్‌పో–2026లో మాజీ మంత్రి, ఎమ్మెల్యే గంగుల కమలాకర్ పాల్గొన్నారు. అసోసియేషన్ ఆఫ్ కన్సల్టింగ్ సివిల్ ఇంజనీర్స్ ఇండియా (ACCEI) ఆధ్వర్యంలో అంబేద్కర్ స్టేడియంలో నిర్వహించిన ఎక్స్‌పోను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, అత్యాధునిక సాంకేతికతను వినియోగించి తక్కువ ఖర్చుతో నాణ్యమైన ఇళ్ల నిర్మాణాలు చేపట్టాలని సూచించారు. భవిష్యత్తులో సివిల్ ఇంజనీరింగ్ రంగానికి భారీ డిమాండ్ ఉంటుందని, విదేశాల్లోనూ సివిల్ ఇంజనీర్ల కొరత నెలకొంటోందన్నారు. కరీంనగర్ వేగంగా అభివృద్ధి చెందుతోందని, మానేరు రివర్ ఫ్రంట్ వంటి ప్రాజెక్టులు పూర్తయితే ఉపాధి అవకాశాలు మరింత పెరుగుతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నగర అధ్యక్షుడు చల్ల హరిశంకర్, మాజీ మేయర్ రవీందర్ సింగ్, కార్పొరేటర్ కాల్వ మల్లేశం, మాజీ కార్పొరేటర్లు బోనాల శ్రీకాంత్, తుల బాలయ్య, అసోసియేషన్ ఆఫ్ కన్సల్టింగ్ సివిల్ ఇంజనీర్స్ ఇండియా కరీంనగర్ సెంటర్ బాధ్యులు పాల్గొన్నారు.

## మంథని నుండి జేఎన్టీయూ కళాశాలకు బస్సులు నడపండి

### -ఐటీ శాఖ మంత్రి శ్రీధర్ బాబు, ఆర్టీసీ ఆర్ఎం, మంథని డీఎంలను కోరిన జేఎన్టీయూ విద్యార్థులు సిబ్బంది




**ముద్ర, మంథని :** రామగిరి మండలం పన్నూరు గ్రామంలోని జేఎన్‌టీయూహెచ్ యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ మంథని విద్యార్థులు, తల్లిదండ్రులు, సిబ్బంది కళాశాలకు ప్రత్యేక బస్సు సర్వీసులు ఏర్పాటు చేయాలని రాష్ట్ర మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, మంథని డిపో మేనేజర్‌కు వినతిపత్రం సమర్పించారు. అలాగే కరీంనగర్ ఆర్టీసీ రీజినల్ అధికారులకు వాట్సాప్ ద్వారా కూడా విజ్ఞప్తి పంపించారు.ప్రస్తుతం పన్నూరు ఎక్స్‌రోడ్ వద్ద బస్సు దిగి కళాశాల వరకు సుమారు కిలోమీటరున్నర నడవాల్సి వస్తోందని, దీంతో ముఖ్యంగా మహిళా విద్యార్థులు, సిబ్బంది తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ఉదయం, సాయంత్రం కళాశాల సమయాలకు మంథని–పెద్దపల్లి మార్గంలో జేఎన్‌టీయూహెచ్ కళాశాల మీదుగా టీజీఎస్‌ఆర్టీసీ బస్సులు నడపాలని కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ బి. విష్ణువర్ధన్, విద్యార్థులు, తల్లిదండ్రులు, సిబ్బంది కోరారు.

ఈ కార్యక్రమంలో కళాశాల అసిస్టెంట్ ప్రొఫెసర్లు సింగారపు శివరామకృష్ణ, ఎస్ కుమార్, విద్యార్థుల తల్లిదండ్రులు పెండ్యాల రామ్ కుమార్, చెన్నోజు రమేష్, ఏరువాక శ్రీనివాస్, విద్యార్థులు పెండ్యాల శ్రీనిధి, చిన్నోజు అఖిల సిబ్బంది మాడిశెట్టి లక్ష్మి నారాయణ, చల్ల మనోహర్ రెడ్డి, తిరుపతి లతోపాటు పలువురు పాల్గొన్నారు.

## అన్ని దానాలకన్న అన్నదానం మిన్న




**ముద్ర, సుల్తానాబాద్ :** అన్ని దానాల కంటే అన్నదానం ఎంతో గొప్పదని సుల్తానాబాద్ మాజీ జెడ్పిటిసి డాక్టర్ అయిల రమేష్ అన్నారు. సుల్తానాబాద్ పట్టణానికి చెందిన ప్రముఖ వ్యాపారవేత్త తాటి పెల్లి భూపతి పుట్టినరోజును పురస్కరించుకొని శనివారం స్థానిక మానసిక వికలాంగుల కేంద్రంలోని వికలాంగులకు అన్నదానం మరియు పండ్లు, స్వీట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిలుగా హాజరైన అయిల రమేష్ మాట్లాడుతూ పుట్టినరోజులు, వివాహ వార్షికోత్సవాల సందర్భంగా హంగులు, ఆర్భాటాలకు పోకుండా పేదలకు, మానసిక వికలాంగులకు అన్నదానం చేయడం అభినందనీయమన్నారు. ఈ సందర్భంగా తాటిపల్లి భూపతి కి జన్మదిన శుభాకాంక్షలు తెలిపి ఘనంగా సన్మానించారు,ఈ కార్యక్రమంలో కందుకూరి ప్రకాష్ రావు (పెద్దన్న), పట్టణ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు కొమురవెల్లి భాస్కర్, యువ సంకల్ప ఫౌండేషన్ అధ్యక్షుడు తుమ్మ రాజ్ కుమార్, శివనాత్రి ప్రసాద్ , రమేష్ , జర్నలిస్టులు కత్తర్ల చందర్, ముంజ శ్రీనివాస్, పెగడ మధు, బోయిరి అశోక్, స్నేహితులు నందాల శ్రీనివాస్ పాల్గొన్నారు.

సమగ్ర సమాచార పత్రిక
# ముద్ర
ఆదివారం 02.08.2026
www.mudranews.in | @mudranews



**ఎండు చేపలు**



నిల్వ చేపల విషయంలో జాగ్రత్త ఉప్పు ఎక్కువగా ఉన్న ఎండు చేపలను పరిమితంగా తీసుకోవాలి. అలాగే ఎక్కడ పెరిగాయి, ఎలా నిల్వ చేశారనే వివరాలు తెలుసుకుని మాత్రమే కొనుగోలు చేయాలి.

## శోభాయమానంగా వసంతోత్సవం



స్వర్ణగిరి దివ్యక్షేత్రంలో శనివారం శ్రీ అష్టలక్ష్మి మండపంలో శ్రీ పద్మావతి గోదాదేవి సమేత శ్రీ వేంకటేశ్వర స్వామి వారికి పంచామృతాలు, పసుపు, సుగంధ ద్రవ్యాలతో వేదమంత్రోచ్ఛారణలతో వసంతోత్సవ సేవను శోభాయమానంగా నిర్వహించి అర్చక స్వాములు కర్పూర మంగళహారతులు సమర్పించారు. సుమారు 5 వేల మందికి పైగా భక్తులు నిత్యాన్న ప్రసాదాన్ని స్వీకరించారు. సాయంత్రం తిరువీధి ఉత్సవ సేవ అనంతరం వేంకటేశ్వర స్వామి వారు దేదీప్యమానంగా వెలుగుతున్న సహస్రదీప కాంతుల మధ్య ఊయలలో ఆసీనులై భక్తులకు దర్శనమిచ్చారు. శనివారం సందర్భంగా జల నారాయణ స్వామి వారికి మంగళహారతులు సమర్పించారు. - ముద్ర ప్రతినిధి, యాదాద్రి భువనగిరి

# వెలుగుమట్ల ఇళ్ల కూల్చివేత రాజ్యాంగ విరుద్ధం

**డాక్టర్ భీమ్రావు యశ్వంత్ అంబేద్కర్**

**ముద్ర ప్రతినిధి, ఖమ్మం:** వెలుగుమట్ల భూదాన బాధితులందరికీ వెలుగుమట్లలోనే ఇళ్లు నిర్మించి ఇవ్వాలని వేలాది మందితో జేఏసీ ఆధ్వర్యంలో నిరసన ప్రదర్శనల నిర్వహించారు. అనంతరం జరిగిన సభలో ముఖ్యఅతిథిగా హాజరైన అంబేద్కర్ మనవడు డాక్టర్ భీమ్రావు యశ్వంత్ అంబేద్కర్ మాట్లాడుతూ 15 సంవత్సరాలుగా బుధాన భూమిలో నివాసముంటున్న ప్రజల ఇళ్లు కూల్చడం అత్యంత అమానుషమని, ఇది రాజ్యాంగ విరుద్ధం అని అన్నారు . కూల్చినవాడి కులం కూల్చివేయబడ్డవాడి కులం వేరు కనుకనే ఈ దుర్మార్గం జరిగిందని ఆరోపించారు. స్థానిక ఎమ్మెల్యే దీనికి బాధ్యత వహించి రాజీనామా చేయాలని కోరారు. ప్రభుత్వం తక్షణమే మేల్కొని మిగతా బాధితులందరికీ కూడా వెలుగుమట్లలోనే ఇల్లు నిర్మించి ఇవ్వాలని లేనియెడల రాహుల్ గాంధీ ఇల్లు ముట్టడి చేస్తామని పేర్కొన్నారు



. తమ ఎంపీలతో పార్లమెంట్లో వెలుగుమట్ల అంశాన్ని లేవనెత్తి ఖమ్మం ఎంపీ రెడ్డి ని నిలదీస్తామన్నారు. రాష్ట్రపతిని స్వయంగా కలిసి ఏలాంటి పర్మిషన్ లేకుండా ఇల్లు కూల్చిన అధికారులను , ప్రజా ప్రతినిధులను తక్షణమే సస్పెండ్ చేసి కూల్చిన వారి ఇల్లు ఖరీదులను వారి వద్దనే రికవరీ చేసేదాకా వెలుగుమట్ల బాధితులకు అండగా ఉంటానని అన్నారు . గౌరవ అతిథి జస్టిస్ చంద్ర కుమార్ మాట్లాడుతూ వెలుగుమట్ల భూదాన విషయంలో నిజనిర్ధారణ కమిటీ వేసి తాము పరిశీలించగా ఇది కొందరు భూ బకాసురులు స్వాధీనం చేసుకునేందుకే అధికారులను బ్లాక్ మెయిల్ చేసి ఈ కుట్రకు పూనుకున్నారని ఆరోపించారు. ఇప్పటికే బాధితులకు మద్దతుగా లీగల్ గా తాను మద్దతు ఇస్తూ వస్తున్నాను కానీ మిగతా బాధితులకు ఆ వెలుగుమట్లలోనే ఇళ్లు నిర్మించి ఇవ్వకపోతే అందరిపై హైకోర్టులో కేసులు వేస్తామని అన్నారు . డా, విశారదన్ మహరాజ్ మాట్లాడుతూ బాధితులు జేఏసీ ఆధ్వర్యంలో చేసిన మహాధర్నా ఫలితంగానే ప్రభుత్వం దిగివచ్చి 311 ఇళ్లు ఇచ్చిందని మిగిలిన వారికి తక్షణమే అదే వెలుగుమట్లలో నిర్మించి ఇవ్వాలని లేనియెడల బాధితులతో రేవంత్ రెడ్డి ఇంటిదాకా పాదయాత్ర కొనసాగిస్తామని అన్నారు . కార్యక్రమంలో బీసీ ఎస్సీ ఎస్టీ రాష్ట్ర కార్యదర్శి పొడకంటి రాంబాబు, ఆర్పిఐ పార్టీ తెలంగాణ ఇన్చార్జ్ మేజర్ చంద్రకాంత్ , జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు తోట్ల ముదిరాజ్ రాఘవేంద్ర , తెలంగాణ విఠల్ , ప్రముఖ న్యాయవాది పంజాకుల లక్ష్మీనారాయణ , జేఏసీ ఖమ్మం జిల్లా నాయకత్వం , భూదాన బాధితులు , ఆయా ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

## ఆపరేషన్ ముస్కాన్ విజయవంతం

**పోలీస్ కమిషనర్ సునీల్దత్**

**ముద్ర ప్రతినిధి, ఖమ్మం:** పోలీసు కమిషనరేట్ పరిధిలో నిర్వహించిన 'ఆపరేషన్ ముస్కాన్–XII' విజయవంతంగా ముగిసిందని ఖమ్మం పోలీస్ కమిషనర్ సునీల్ దత్ తెలిపారు. ఈ ప్రత్యేక డ్రైవ్ లో మొత్తం 122 మంది చిన్నారులను రక్షించారన్నారు. వీరిలో 110 మంది బాలురు, 12 మంది బాలికలు ఉన్నారన్నారు. తెలంగాణకు చెందిన 69 మంది చిన్నారులను రెస్క్యూ చేయగా ఇతర రాష్ట్రాలకు చెందిన 53 మంది చిన్నారులను గుర్తించారని వెల్లడించారు. ఖమ్మం పోలీసులు, కార్మిక శాఖ, డీసీపీయూ, సీడబ్ల్యూసీ, స్వచ్ఛంద సంస్థల సమన్వయంతో నాలుగు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి విస్తృతంగా తనిఖీలు నిర్వహించారని, పరిశ్రమలు, కంపెనీలు, దుకాణాలు, హోటళ్లు, నిర్మాణ ప్రదేశాలు తదితర ప్రాంతాల్లో సోదాలు చేపట్టారన్నారు. తనిఖీల్లో బాల కార్మికులు, భిక్షాటన చేస్తున్న పిల్లలను, ఇతర ప్రమాదకర పరిస్థితుల్లో ఉన్న చిన్నారులను గుర్తించి రక్షించారని తెలిపారు. 53 ఎఫ్ఐఆర్ కేసులు నమోదు అయినట్లు తెలిపారు 103 మంది పిల్లలను వారి కుటుంబ సభ్యులందరికీ అప్పగించడం జరుగుతుందని, 19 మంది పిల్లలను బాలల సంరక్షణ గృహంలో ఉంచడం జరిగిందన్నారు.

## నియోజకవర్గంలో 6 లక్షల మొక్కలు నాటడమే లక్ష్యం

**ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి**

**ముద్ర, భువనగిరి:** భువనగిరి నియోజకవర్గంలో 5 నుంచి 6 లక్షల మొక్కలు నాటడమే లక్ష్యంగా వనమహోత్సవ కార్యక్రమాలు చేపడుతున్నామని ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి తెలిపారు. శనివారం ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో నిర్వహించిన వనమహోత్సవంలో పాల్గొని మొక్కలు నాటారు. భువనగిరి పట్టణంలోనే 60 వేల మొక్కలు



నాటనున్నట్లు తెలిపారు. పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని పిలుపునిచ్చారు.అనంతరం పట్టణంలోని శ్రీ సీతా రామాంజనేయ సహిత సంతోషిమాత ఆలయాన్ని దర్శించిన ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయంలో జరిగిన అన్నదాన కార్యక్రమంలో పాల్గొని భక్తులకు అన్నప్రసాదం పంపిణీ చేశారు. కార్యక్రమాల్లో ప్రజాప్రతినిధులు, అధికారులు, ఆలయ నిర్వాహకులు, భక్తులు పాల్గొన్నారు.

# గోదావరి వరద నివారణలో ఉదాసీన వైఖరి

**.మాజీ మంత్రి పువ్వాడ**

**ముద్ర ప్రతినిధి, ఖమ్మం:** భద్రాచలం ఏరియాలో ప్రస్తుతం కనిపిస్తున్న గోదావరి వరద ఉద్ధృతి సహజ పరిస్థితుల వల్ల మాత్రమే కాదని, దిగువన ఆంధ్రప్రదేశ్‌లో నిర్మాణంలో ఉన్న పోలవరం ప్రాజెక్టు బ్యాక్‌వాటర్ ప్రభావం కూడా ప్రధాన కారణమని మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు.పోలవరం ప్రాజెక్టు నిర్మాణం కారణంగా భద్రాచలం, దాని పరిసర గ్రామాల్లో ముంపు సమస్య మరింత తీవ్రరూపం దాల్చిందని వరదలు వచ్చిన ప్రతిసారి ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నప్పటికీ, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపడంలో పూర్తిగా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయని



విమర్శించారు.పోలవరం ముంపు సమస్యపై తాను మంత్రిగా బీఆర్ఎస్ పార్టీ తరపున తొలి నుంచి నిరంతరం పోరాటం చేశానని తెలిపారు. గతంలో అనేక వేదికలపై కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకువచ్చి, తెలంగాణ ప్రజల పక్షాన బలంగా గళం వినిపించానని గుర్తుచేశారు. భద్రాచలం ప్రాంత ప్రజల ప్రయోజనాల పరిరక్షణలో బీఆర్ఎస్ ఎప్పటికీ రాజీపడదని స్పష్టం చేశారు. ఇప్పటికైనా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పరస్పరం బాధ్యతలు నెట్టేసుకునే ధోరణిని విడనాడి, పోలవరం బ్యాక్‌వాటర్ ప్రభావంపై సమగ్ర అధ్యయనం నిర్వహించి, భద్రాచలం పరిసర ప్రాంతాలకు శాశ్వత ముంపు నివారణ చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. వరదల సమయంలో తాత్కాలిక సహాయక చర్యలకే పరిమితం కాకుండా, భవిష్యత్తులో ముంపు సమస్య పునరావృతం కాకుండా శాశ్వత కార్యాచరణ ప్రణాళికను రూపొందించి అమలు చేయాలని పువ్వాడ కోరారు.

## 127 మంది బాలల గుర్తింపు

**సూర్యాపేట ఎస్పీ కె. నరసింహ**

**ముద్ర, సూర్యాపేట:** జిల్లాలో నెలరోజుల పాటు నిర్వహించిన 12వ విడత ఆపరేషన్ ముస్కాన్ విజయవంతంగా ముగిసిందని సూర్యాపేట ఎస్పీ కె. నరసింహ తెలిపారు. ఈ కార్యక్రమంలో వెట్టిచాకిరి, నిరాదరణకు గురైన 127 మంది బాలలను గుర్తించి రక్షించగా, సంబంధితంగా 90 కేసులు నమోదు చేసినట్లు వెల్లడించారు.జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఎస్పీ మాట్లాడుతూ, తెలంగాణకు చెందిన 56 మంది, ఇతర రాష్ట్రాలకు చెందిన 71 మంది బాలలను గుర్తించి వారి తల్లిదండ్రులు లేదా సంరక్షకులకు అప్పగించినట్లు తెలిపారు. ఆపరేషన్ ముస్కాన్‌లో విశేషంగా పనిచేసిన పోలీసు, బాలల సంరక్షణ, రెవెన్యూ, లేబర్ తదితర శాఖల సిబ్బందిని అభినందించారు.

## బీజేవైఎం ఆధ్వర్యంలో సీఎం దిష్టిబొమ్మ దహనం

**ముద్ర ప్రతినిధి, యాదాద్రి భువనగిరి :** బీజేపీ యువమోర్చా (బీజేవైఎం) ఆధ్వర్యంలో శనివారం భువనగిరి వినాయక చౌరస్తాలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు దయ్యాల కుమారస్వామి మాట్లాడుతూ, బీటెక్ విద్యార్థులపై సీఎం చేసిన వ్యాఖ్యలు బాధ్యతారాహిత్యంగా ఉన్నాయని ఆరోపించారు.భువనగిరి పట్టణ అధ్యక్షుడు మామిడోజు పవన్ కుమార్ మాట్లాడుతూ, విద్యార్థులకు ఉపాధి అవకాశాలు



కల్పించాల్సిన ప్రభుత్వం వారినే విమర్శించడం సరికాదన్నారు. కార్యక్రమంలో బీజేపీ, బీజేవైఎం నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## అభివృద్ధి పనుల పరిశీలన

**ముద్ర ప్రతినిధి, యాదాద్రి భువనగిరి :** మండలంలోని తాజ్పూర్ గ్రామ సర్పంచ్ ర్యాకల సంతోష శ్రీనివాస్ గ్రామంలో చేపట్టిన పలు అభివృద్ధి పనులను ఎంపీఓ దినకర్ శనివారం పరిశీలించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి నర్సింగరావు, ఉప సర్పంచ్ ఓరుగంటి కృష్ణ, వార్డు మెంబర్లు పాల్గొన్నారు.

## మాక్ ఎలక్షన్స్‌పై విద్యార్థులకు అవగాహన

**ముద్ర, దేవరకొండ:** ప్రజాస్వామ్య వ్యవస్థలో ఎన్నికల ప్రాముఖ్యతను విద్యార్థులకు తెలియజేయాలనే ఉద్దేశంతో దేవరకొండ పట్టణంలోని బ్రిలియంట్ గ్రామర్ హైస్కూల్లో శనివారం మాక్ ఎలక్షన్స్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు తుమ్మ.ఆనంద కిరీటి రెడ్డి, డైరెక్టర్ హారిక ఎన్నికల ప్రక్రియ, ఓటు హక్కు విలువ, పోలింగ్ విధానం, ఈవీఎంల వినియోగం వంటి అంశాలను విద్యార్థులకు వివరించారు. విద్యార్థులు ఆసక్తిగా పాల్గొని ఎన్నికల ప్రక్రియపై తమ సందేహాలను నివృత్తి చేసుకున్నారు. పాఠశాల ఉపాధ్యాయ బృందం విద్యార్థులు పాల్గొన్నారు.

## స్మార్ట్ కిడ్జ్ లో వెలివిరిసిన స్నేహబంధం

**ముద్ర ప్రతినిధి, ఖమ్మం:** స్మార్ట్ కిడ్జ్ పాఠశాలలో స్నేహితుల దినోత్సవం ఆనందోత్సవాలతో నిర్వహించారు. పాఠశాల విద్యార్థులు తమ మిత్రుల చేతికి ఫ్రెండ్షిప్ బ్యాండ్ కట్టి, మిఠాయిలు తినిపించి తమ స్నేహ బంధాన్ని చాటిచెప్పారు. చిన్నప్పటి నుండి తరగతిలో తమతో పాటు చదువుకుంటూ ప్రతి తరగతిలో తమతో మైత్రి బంధాన్ని పంచుకుంటున్న తమ మిత్రులతో సరదాగా, హుషారుగా గడిపారు. ఫ్రెండ్షిప్ డే వేడుకలతో పాఠశాలలో ఉత్సాహం, ఆనందం వెల్లి విరిసింది. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ చింతనిప్పు కృష్ణ చైతన్య మాట్లాడుతూ స్నేహ బంధానికి సరిహద్దులు లేవని, వర్ణ, ప్రాంతీయాలకు అతీతంగా స్నేహబంధం గౌరవం ఎల్లప్పుడూ వెల్లి విరుస్తున్నదని పేర్కొన్నారు. చిన్నప్పుడు ఏర్పడే స్నేహబంధం జీవితాంతం,కలకాలం వెల్లి విరుస్తుందని తెలియజేశారు. పురాణాల కాలం నుండి ఏఐ కాలం వరకు స్నేహబంధం విలువలు పదిలంగా ఉంటున్నాయని, ఇది స్నేహబంధం గొప్పతనాన్ని చాటి చెబుతున్నదని తెలిపారు. కార్యక్రమంలో డైరెక్టర్ చింతనిప్పు సుకన్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు



## హామీలను విస్మరించిన కాంగ్రెస్

**ముద్ర ప్రతినిధి, ఖమ్మం:** తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన అనేక హామీలను అమలు చేయకుండా కాలయాపన చేస్తోందని సీపీఐ(ఎంఎల్) మాస్ లైన్ జిల్లా కార్యదర్శి సీవై పుల్లయ్య విమర్శించారు. రామనరసయ్య విజ్ఞాన కేంద్రంలో జరిగిన ఖమ్మం డివిజన్ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఫీజు రీయింబర్స్‌మెంట్, ఆరోగ్యశ్రీ బకాయిలు, మహాలక్ష్మి పథకంలో రూ.2,500 సహా పలు హామీలు నెరవేర్చలేదని ఆరోపించారు.కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనగా ఆగస్టు 10న నిర్వహించే "జైలు భరో" కార్యక్రమంలో రైతులు, కార్మికులు, కూలీలు పెద్దఎత్తున పాల్గొనాలని పిలుపునిచ్చారు. అనంతరం అజ్ఞాత దళ కమాండర్ లింగన్న వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. వర్షాల కారణంగా విషజ్వరాలు ప్రబలకుండా ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలని కూడా కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఆవుల అశోక్, బందెల వెంకయ్య ,శివలింగం డివిజన్ కార్యదర్శి టి ఝాన్సీ , నాయకులు సిహెచ్ శిరోమణి కె శ్రీను శోభ , దేవల లక్ష్మణ్ రామనాథం రాకేష్ వెంకటేష్ తేజ నాయక్ లక్ష్మణ్ పాపారావు తదితరులు పాల్గొన్నారు.




## ప్రభుత్వం ఉద్యమకారులను గుర్తించాలి

**ముద్ర ప్రతినిధి, యాదాద్రి భువనగిరి :** ప్రభుత్వం తెలంగాణ ఉద్యమకారులను గుర్తించాలని రాష్ట్ర ఉద్యమకారుల సంఘం అధ్యక్షులు పూస శ్రీనివాస్ అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని పెన్షనర్ భవన్ లో ఉద్యమకారుల సంఘం ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ పోరాడిన ప్రతి ఒక్క ఉద్యమకారునికి న్యాయం జరిగే విధంగా ప్రభుత్వం గుర్తించాలన్నారు. వారిపై ఉన్న కేసులను బే షరతుగా కొట్టివేసి 30,000 పెన్షన్ 250 గజాల స్థలం, హెల్త్ కార్డు 100 కోట్లతో కార్పొరేషన్ ఏర్పాటు ఉచిత ప్రయాణ వసతి రైలు బస్సు వీటన్నింటిని వేగవంతంగా అమలు చేయాలన్నారు. ఈ సమావేశంలో సహ అధ్యక్షులు కృష్ణ, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జంపాల శ్రీనివాసు, రాష్ట్ర కార్యదర్శి చల్లగురుగుల రఘుబాబు, లక్ష్మినారాయణ, రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ మెరుగు మధు, కంచె మల్లయ్య, సీసా మహేశ్వరి, జిల్లా అధ్యక్షులు ముష్క జైపాల్ రెడ్డి, పడమటి జగన్మోహన్ రెడ్డి, సుర్వి శ్రీనివాస్, కొలుపుల అమరేందర్, గొర్ల లక్ష్మణ్, గోపగాని గణేష్, పట్టణ అధ్యక్షులు మంతపురి వినోద్ కుమార్, మాటూరి అశోక్ పాల్గొన్నారు



## భువనగిరిలో తల్లి పాల వారోత్సవాలు

**ముద్ర ప్రతినిధి, యాదాద్రి భువనగిరి:** భువనగిరి పట్టణంలోని అర్బన్ కాలనిలో సెక్టర్–1 అంగన్ వాడి కేంద్రంలో తల్లిపాల వారోత్సవాలు శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సీడీపీఓ శైలజ మాట్లాడుతూ ముర్రుపాలపై అవగాహ కల్పించారు. తల్లిపాలు బిడ్డ ఆరోగ్యానికి అమృతం వంటివని తల్లి పాలు ఇవ్వడం వల్ల తల్లి, బిడ్డ ఆరోగ్యంగా ఉంటారన్నారు. తల్లిపాల వల్ల వ్యాధి నిరోధక శక్తి పెరుగుతుందని, తల్లి, బిడ్డల మధ్య అనుబంధం పెరుగుతుంది, కంటి చూపు మెరుగ్గా ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో కే. పద్మ సూపర్ వైజర్ అంగవ్వాడి టీచర్లు, ఆయాలు, తల్లులు, పిల్లలు పాల్గొన్నారు.




## రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి

**ముద్ర, సూర్యాపేట:** కోదాడ–జడ్చర్ల జాతీయ రహదారిపై చిలుకూరు మండలం సీతారామపురం స్టేజి సమీపంలో ద్విచక్ర వాహనాన్ని బొలెరో వాహనం ఢీకొట్టడంతో యువకుడు మృతి చెందగా, మరో వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు.మృతుడు మఠంపల్లి మండలానికి చెందిన భూక్య నరసింహ (19) గా గుర్తించారు. ఆయన ఫొటోగ్రాఫర్‌గా పనిచేస్తున్నారు. గాయపడిన గుగులోతు గోపిరాములు అలియాస్ కొండ (భోజ్య తండా) పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన చికిత్స కోసం ఖమ్మంలోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు.ప్రమాద బాధితులను స్థానికులు 108 అంబులెన్స్ ద్వారా హుజూర్‌నగర్ ఏరియా ఆస్పత్రికి తరలించగా, వైద్యులు భూక్య నరసింహ మృతిచెందినట్లు నిర్ధారించారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## నిరుద్యోగి ఆత్మహత్యాయత్నం

**ముద్ర ప్రతినిధి, ఖమ్మం:** ప్రభుత్వ ఉద్యోగాల కోసం ఎన్నో సంవత్సరాలుగా సిద్ధమవుతూ, వరుసగా పోటీ పరీక్షలు రాసిన ముదిగొండ మండలం న్యూ లక్ష్మీపురం గ్రామానికి చెందిన గద్దం వేణు అను ఓ నిరుద్యోగ యువకుడు సూసైడ్ నోట్ రాసి ఆత్మహత్య యత్నానికి పాల్పడ్డాడు. ప్రభుత్వ నోటిఫికేషన్లు సకాలంలో వెలువడకపోవడం, కుటుంబ పరిస్థితులు, వ్యక్తిగత సమస్యలతో తీవ్ర మనస్తాపానికి గురైనట్లు తన లేఖలో పేర్కొన్నాడు. ఈ నేపథ్యంలో ప్రభుత్వానికి ఉద్దేశించి సూసైడ్ నోట్ రాసి ఆత్మహత్యాయత్నానికి పాల్పడినట్లు ఆ లేఖలో వివరించాడు. లేఖలో పేర్కొన్న వివరాల ప్రకారం, చిన్నప్పటి నుంచే ప్రభుత్వ ఉద్యోగం లక్ష్యంగా గ్రూప్–1, గ్రూప్–2, గ్రూప్–3, గ్రూప్–4, ఎస్ఐ, పోలీస్ కానిస్టేబుల్ తదితర పరీక్షలకు సిద్ధమై పలుమార్లు పరీక్షలు రాశాడు. అయితే ఉద్యోగం దక్కకపోవడం, ప్రభుత్వ నియామక ప్రక్రియల్లో జాప్యం, కుటుంబ ఆర్థిక ఇబ్బందులు, తల్లీ అనారోగ్యం, అక్క ఆరోగ్య సమస్యలు తనను తీవ్ర నిరాశకు గురిచేశాయని పేర్కొన్నాడు. తన పరిస్థితిని ప్రభుత్వం మానవతా దృక్పథంతో పరిశీలించాలని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క స్పందించి నిరుద్యోగుల సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించాలని లేఖలో విజ్ఞప్తి చేశాడు. తనలాంటి నిరుద్యోగులు ఇలాంటి పరిస్థితులకు చేరుకోకుండా ప్రభుత్వ ఉద్యోగాల భర్తీ ప్రక్రియను వేగవంతం చేయాలని కూడా కోరాడు. ఈ ఘటన నిరుద్యోగ యువత ఎదుర్కొంటున్న మానసిక ఒత్తిడి, ఉద్యోగాల కోసం దీర్ఘకాల నిరీక్షణ వంటి అంశాలను మరోసారి చర్చకు తెచ్చింది.



సమగ్ర సమాచార పత్రిక

# ముద్ర

ఆదివారం 02.08.2026

www.mudranews.in | @mudranews



**తాజా చేపలనే కొనండి**

ఎక్కువ దుర్వాసన వస్తే, చేప మెత్తగా ఉంటే లేదా కళ్లపై తెల్లటి పొర ఉంటే వాటిని కొనొద్దు. గులాబీ లేదా ఎర్రటి మొప్పలు ఉన్న చేపలే తాజావి.



## యూరాలజికల్ క్యాన్సర్ల చికిత్సపై అంతర్జాతీయ సదస్సు




**ముద్ర, హైదరాబాద్:** యూరాలజికల్ (మూత్ర, జననేంద్రియ సంబంధిత) క్యాన్సర్ల నిర్ధారణ, చికిత్సలో అత్యాధునిక సాంకేతికతలు, ఖచ్చితత్వంతో కూడిన వైద్య విధానాలపై ప్రపంచస్థాయి నిపుణులు హైదరాబాద్‌లో చర్చించారు. సొసైటీ ఆఫ్ జెనిటోయూరినరీ ఆంకాలజిస్ట్స్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 5వ వార్షిక సదస్సు – 2026 శనివారం ప్రారంభమైంది. బసవతారకం ఇండో–అమెరికన్ క్యాన్సర్ హాస్పిటల్ అండ్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్, అపోలో హాస్పిటల్స్ సంయుక్తంగా నిర్వహిస్తున్న ఈ రెండు రోజుల సదస్సులో దేశ, విదేశాల నుంచి 200 మందికి పైగా ప్రముఖ క్యాన్సర్ నిపుణులు, శస్త్రచికిత్స వైద్యులు, రేడియేషన్ ఆంకాలజిస్టులు, పరిశోధకులు పాల్గొన్నారు. "ప్రెసిషన్ ఆంకాలజీ ఇన్ యాక్షన్" అనే ప్రధాన అంశంతో జరుగుతున్న ఈ సదస్సులో ప్రోస్టేట్, మూత్రాశయం, మూత్రపిండం, వృషణాలు, పురుషాంగానికి సంబంధించిన క్యాన్సర్ల నిర్ధారణ, చికిత్సలో చోటుచేసుకుంటున్న తాజా పురోగతులపై శాస్త్రీయ చర్చలు నిర్వహిస్తున్నారు. ప్రెసిషన్ మెడిసిన్, మాలిక్యులర్ డయాగ్నస్టిక్స్, రోబోటిక్ శస్త్రచికిత్సలు, ఆధునిక రేడియేషన్ సాంకేతికతలు, టార్గెటెడ్ థెరపీలు, ఇమ్యూనోథెరపీ, బహుళ విభాగాల సమన్వయంతో కూడిన చికిత్సా విధానాలు ప్రధాన ఆకర్షణగా నిలిచాయి. సదస్సును బసవతారకం ఇండో–అమెరికన్ క్యాన్సర్ హాస్పిటల్ ట్రస్టు బోర్డు సభ్యురాలు నారా బ్రాహ్మణి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి రోగికి అవసరానికి అనుగుణంగా వ్యక్తిగతీకరించిన చికిత్స అందించడమే ప్రెసిషన్ ఆంకాలజీ లక్ష్యమని తెలిపారు. జీనోమిక్స్, మాలిక్యులర్ డయాగ్నస్టిక్స్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, టార్గెటెడ్ థెరపీల సమ్మేళనంతో పాటు మానవత్వం, కరుణతో కూడిన వైద్యం కూడా అంతే ముఖ్యమని పేర్కొన్నారు. పరిశోధన, నవీన ఆవిష్కరణల ఆధారంగా భవిష్యత్ వైద్యరంగం ముందుకు సాగుతుందని, బసవతారకం ఆసుపత్రి ఆ దిశగా కృషి చేస్తోందని చెప్పారు. సదస్సు ఆర్గనైజింగ్ సెక్రటరీ డాక్టర్ సంజయ్ అడ్డా మాట్లాడుతూ, యూరో–ఆంకాలజీ రంగంలో శాస్త్రీయ విజ్ఞాన మార్పిడి, బహుళ విభాగాల సమన్వయం, ఆధార పూర్వక వైద్య విధానాల అమలుకు SO-GOCON కీలక వేదికగా నిలుస్తోందన్నారు. సైంటిఫిక్ చైర్మన్ డాక్టర్ రాకేష్ ఎం. శర్మ మాట్లాడుతూ, బసవతారకం ఇండో–అమెరికన్ క్యాన్సర్ హాస్పిటల్, అపోలో హాస్పిటల్స్ భాగస్వామ్యం ద్వారా ప్రపంచవ్యాప్తంగా క్యాన్సర్ చికిత్సలో జరుగుతున్న పురోగతిని భారతీయ రోగులకు అందించేందుకు అవకాశం లభిస్తోందన్నారు. సదస్సులో అంతర్జాతీయ నిపుణులు ప్రొఫెసర్ నోయెల్ క్లార్క్, ప్రొఫెసర్ మనీష్ కోహ్లీ, డాక్టర్ జాన్ క్రిస్టో డొలియాస్, డాక్టర్ యాన్ షక్‌మన్, డాక్టర్ అలెజాండ్రో బెర్లిన్‌తో పాటు దేశంలోని ప్రముఖ యూరో–ఆంకాలజిస్టులు పాల్గొని తమ అనుభవాలను పంచుకున్నారు. సదస్సుకు ముందు నిర్వహించిన యూరో–రేడియేషన్ ఆంకాలజీ, యూరో–పాథాలజీ ప్రీ–కాన్ఫరెన్స్ వర్క్‌షాప్‌లు యువ వైద్యులు, పీజీ విద్యార్థులకు ఆధునిక నిర్ధారణ, చికిత్సా విధానాలపై శిక్షణ అందించాయి. SO-GOCON 2026 ద్వారా హైదరాబాద్ మరోసారి అంతర్జాతీయ స్థాయి క్యాన్సర్ వైద్య సదస్సులకు ఆతిథ్యం ఇస్తూ, ప్రెసిషన్ ఆంకాలజీ, పరిశోధన, వైద్య విద్యలో దేశంలో ప్రముఖ కేంద్రంగా తన స్థానాన్ని మరింత బలోపేతం చేసుకుంది.

## సంక్షేమ పథకాలు సమర్థవంతంగా అమలయ్యేలా చూడాలి





**జిల్లా కలెక్టర్ హైమావతి**

**ముద్ర ప్రతినిధి, సిద్దిపేట :** కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల అభివృద్ధి, సంక్షేమ పథకాలు క్షేత్రస్థాయిలో సమర్థవంతంగా అమలయ్యేలా చూడాలని జిల్లా కలెక్టర్ కే. హైమావతి అధికారులను ఆదేశించారు. శనివారం ఐడిఓసి సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ జిల్లా అధికారులతో సమావేశం నిర్వహించి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల అభివృద్ధి సంక్షేమ పథకాల ప్రగతిపై సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ పేద ప్రజల అభివృద్ధి, సంక్షేమం కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విడివిడిగా మరియు కొన్ని పథకాలను సంయుక్తంగా అమలు చేస్తున్నాయని అవి క్షేత్రస్థాయిలో లబ్ధిదారులకు లబ్ధి చేకూర్చేలా అధికారులు ఆయా పథకాలను పారదర్శకంగా అమలు చేయాలని అన్నారు. ముఖ్యంగా విద్యా, వైద్యం, రైతు సంక్షేమం, ఉద్యానవనం, పశుసంవర్ధకం, మత్స్య సంపద పెంపు, గ్రామీణ అభివృద్ధి, పునరుత్పాదక ఎనర్జీ, మౌలిక వసతుల కల్పన, భూగర్భ జలాల పెంపు, గృహ నిర్మాణం, మరుగుదొడ్ల నిర్మాణం, మహిళలు మానవ వనరుల అభివృద్ధి సంబంధిత పథకాలు పారదర్శకంగా అమలై వాటి వలన పేద ప్రజలు లబ్ధి పొంది అభివృద్ధి చెందేల ప్రణాళిక బద్దంగా పని చేయాలని ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ రెవెన్యూ లక్ష్మి కిరణ్, వివిధ శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

**సర్ పొడగింపు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి**

ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియ ఈనెల 10 వరకు ఎన్నికల సంఘం పొడిగించినందున ఈ అవకాశాన్ని జిల్లా ప్రజలు ఉపయోగించుకోవాలని జిల్లా కలెక్టర్ కే. హేమావతి తెలిపారు. శనివారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో రాజకీయ పార్టీల ప్రతినిధులతో జిల్లా కలెక్టర్ సమావేశం నిర్వహించి సర్ పై చర్చించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియ ఈనెల 10 వరకు ఎన్నికల సంఘం ఎన్నికల సంఘం పొడిగించి నందున ఈ అవకాశాన్ని జిల్లా ప్రజలు ఉపయోగించుకునేల రాజకీయ పార్టీల ప్రతినిధులు చొరవ చూపాలని అన్నారు. ఓటర్ల జాబితా డిజిటలైజేషన్ పూర్తయిన తర్వాత ఆగస్టు 17న ఓటర్ల జాబితా ముసాయిదా ప్రచురించడం జరుగుతుందని, దీనిపై సెప్టెంబర్ 16 వరకు అభ్యంతరాలు స్వీకరించి అక్టోబర్ 16 నాటికి వాటిని పరిష్కరించి అక్టోబర్ 19న కేంద్ర ఎన్నికల సంఘం తుది ఓటర్ జాబితాను ప్రచురిస్తుందని తెలిపారు. సర్ లో భాగంగా చనిపోయిన ఓటర్లు, డబుల్ ఓటరు, పూర్తిగా షిఫ్ట్ అయిన ఓటర్లను తీసివేయగా జిల్లాలో 99.75 శాతం ఓటర్ల డిజిటలైజేషన్ పూర్తయిందని తెలిపారు. 1200 మంది ఓటర్లు సంఖ్య దాటిన పోలింగ్ స్టేషన్ల హేతుబద్ధీకరణ గురించి ఈ సందర్భంగా చర్చించార. ఈ కార్యక్రమంలో శిక్షణ డిప్యూటీ కలెక్టర్ భవ్య, వివిధ గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులు, కలెక్టరేట్ ఎన్నికల విభాగం అధికారులు తదితరులు పాల్గొన్నారు.




## ఆర్యవైశ్య సంఘం పట్టణ అధ్యక్షుడిగా జనార్దన్



**ముద్ర, దేవరకొండ:** కొండమల్లేపల్లి పట్టణ ఆర్యవైశ్య సంఘం నూతన కమిటీని శ్రీచక్ర శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి దేవాలయంలో శనివారం పట్టణ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆర్యవైశ్య సంఘం పట్టణ నూతన అధ్యక్షులుగా ఊరే జనార్దన్, ప్రధాన కార్యదర్శిగా దాచేపల్లి వెంకటేశ్వర్లు, కోశాధికారిగా కొత్త వెంకటేశ్వర్లులను ఆర్యవైశ్య సంఘం నాయకుల సమక్షంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఏకగ్రీవంగా ఎన్నికైన పట్టణ కమిటీ 2026 – 2028 రెండు సంవత్సరాలు పదవీ బాధ్యతలు ఉంటాయన్నారు. ఈ సందర్భంగా కొండమల్లేపల్లి పట్టణ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నికైన ఊరే జనార్దన్ మాట్లాడుతూ నాపై నమ్మకంతో ఏకగ్రీవంగా పట్టణ అధ్యక్షుడిగా నియమించినందుకు ఆర్యవైశ్య సోదరులకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. సంఘం సభ్యులను అందరినీ సమన్వయం చేసుకుంటూ సంఘ అభివృద్ధికి పాటుపడతానని స్పష్టం చేశారు. ఆర్యవైశ్య ఐక్యతకు కృషి చేస్తూ శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి దేవాలయ ప్రతిష్టను పెంచుతూ సంఘం సభ్యులందరి ఆమోదంతో కార్యక్రమాలు ముందుకు తీసుకు వెళుతూ ఆర్యవైశ్య సంఘ అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. ఆర్యవైశ్యులకు అందుబాటులో ఉంటూ తమ సహకారాలు అందిస్తానని పేర్కొన్నారు. అనంతరం నూతన కమిటీని సంఘం నాయకుల సమక్షంలో శాలువాలతో ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. వారితోపాటు ఈ కార్యక్రమంలో గౌరవ అధ్యక్షులు ఆలంపల్లి నరసింహ, ఆర్యవైశ్య మహాసభ జిల్లా మాజీ అధ్యక్షులు పానుగంటి మల్లయ్య, దేవరకొండ నియోజకవర్గ రైస్ మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షులు సముద్రాల వెంకటేశ్వర్లు, గోవిందు జగతయ్య, నీలా లక్ష్మయ్య, కామిశెట్టి పాండరయ్య, రాచమల్ల నరసింహ, సముద్రాల ధనయ్య, దాచేపల్లి నరేందర్, కర్నాటి శ్రీనివాస్, చెట్లపల్లి శ్రీనివాస్, జిన్నం రామ్మూర్తి, ఆకుతోట లక్ష్మీనారాయణ, వీరమళ్ళ వెంకటయ్య, మిర్యాల శ్రీనివాస్, సముద్రాల కిరణ్, బూరుగు కుమార్, చందా ధనుంజయ, కామిశెట్టి శ్రీనివాస్, గౌరు వెంకటేశ్వర్లు, పాంపాటి శ్రీధర్, అంకిశెట్టి శేఖర్, తెరెటిపల్లి విఠల్, మారం వెంకన్న, మంచికంటి జగన్మోహన్, బచ్చు వెంకటేశ్వర్లు, ఆలంపల్లి విజయ్, బూరుగు శ్రీకాంత్, నీలా విజయ్, గుమ్మడవల్లి జనార్దన్, నీలా ప్రవీణ్, గందె రాము తదితరులు పాల్గొన్నారు.

## అక్రమ గ్యాస్ రీఫిల్లింగ్ సెంటర్లపై మెరుపుదాడులు




**ముద్ర ప్రతినిధి, మెదక్:** నమ్మదగిన సమాచారం మేరకు శనివారం మెదక్ జిల్లా సివిల్ సప్లై ఇన్స్పెక్టర్, రెవిన్యూ సిబ్బంది, పోలీస్ అధికారులతో కలిసి చేగుంట మండలంలోని మక్కరాజుపేట్ గ్రామంలో అక్రమంగా గ్యాస్ రీఫిల్లింగ్ చేస్తున మూడు దుకణాలలో ఆకస్మిక దాడులు నిర్వహించారు. ఈ తనిఖీలలో వంజరి రాజుకి చెందిన శ్రీ లక్ష్మి నరసింహ స్వామి రిపేర్ షాప్ లో 7 డొమెస్టిక్ సిలిండర్స్, అగతదివిటి సురేష్ కి చెందిన గంగ లైట్ హౌస్ షాప్ లో 2 డొమెస్టిక్ సిలిండర్స్, మహేందర్ కి చెందినా లక్ష్మి నరసింహ సీడ్స్ షాప్ లో 6 డొమెస్టిక్ సిలిండర్స్, 1 కమర్షియల్ సిలిండర్స్ స్వాధీనం చేసుకున్నారు. జప్తు చేసిన 15 డొమెస్టిక్ సిలిండర్స్ తో పాటు ఒక కమర్షియల్ సిలిండర్‌ను చేగుంట లోని దేవి భారత్ గ్యాస్ ఏజెన్సీకి అప్పగించారు. పై ముగ్గురిపై అత్యవసర వస్తువుల చట్టం, 1955 లోని సెక్షన్ 6– ఎ ప్రకారం కేసు నమోదు చేసి చట్టపరమైన చర్యలు చేపట్టనున్నారు. అదేవిధంగా, చేగుంట పోలీస్ స్టేషన్‌లో కూడా వారి మీద క్రిమినల్ కేసు నమోదు చేశారు. జిల్లా పౌర సరఫరాల అధికారి పి. నిత్యానందం మాట్లాడుతూ మెదక్ జిల్లా వ్యాప్తంగా ఎవరైనా అక్రమంగా గ్యాస్ రీఫిల్లింగ్ కార్యకలాపాలకు పాల్పడినా, డొమెస్టిక్ సిలిండర్స్‌లను కమర్షియల్ కొరకు ఉపయోగించిన వారి మీద కఠినమైన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

## పరిశుభ్రత ప్రతి ఒక్కరి బాధ్యత

**5ఎస్ విధానంతో పోలీస్ స్టేషన్లలో క్రమబద్ధీకరణ**

**ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు**





**ముద్ర ప్రతినిధి, మెదక్:** మెదక్ జిల్లా పోలీస్ కార్యాలయంతో పాటు జిల్లా పరిధిలోని అన్ని పోలీస్ స్టేషన్లలో శనివారం ఫటీగ్ డ్యూటీలో భాగంగా ప్రత్యేక పరిశుభ్రత కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీసు అధికారులు, సిబ్బంది పోలీస్ స్టేషన్ ఆవరణలు, కార్యాలయ పరిసరాలు, రికార్డు గదులు, సందర్శకులు వేచి ఉండే ప్రదేశాలు, పార్కింగ్ ప్రాంతాలను శుభ్రపరిచారు. కార్యాలయాల్లోని ఫైళ్లు, రికార్డులను క్రమబద్ధీకరించి 5ఎస్ విధానం (సార్ట్ , సెట్ ఇన్ ఆర్డర్ , షైన్ , స్టాండరైజ్, సస్టెయిన్ )ను అమలు చేశారు. మొక్కలు నాటి, ఇప్పటికే ఉన్న మొక్కలకు నీరు పోసి వాటి సంరక్షణ చేపట్టారు. ఒక్కరోజు పరిశుభ్రత రాదు.. ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు మాట్లాడుతూ...పరిశుభ్రత అనేది ఒక్కరోజు నిర్వహించే కార్యక్రమం కాదు. అది ప్రతి ఒక్కరి దైనందిన బాధ్యత. పరిశుభ్రమైన, క్రమబద్ధమైన పోలీస్ స్టేషన్ ప్రజల్లో విశ్వాసాన్ని పెంపొందించడంతో పాటు వేగవంతమైన, నాణ్యమైన పోలీసు సేవలు అందించడానికి దోహదపడుతుంది. ఫటీగ్ డ్యూటీలో భాగంగా చేపట్టే పరిశుభ్రత కార్యక్రమాలు, రికార్డుల క్రమబద్ధీకరణ, 5ఎస్ విధానం అమలు వల్ల కార్యాలయాల పనితీరు మరింత మెరుగుపడుతుంది. ప్రతి పోలీసు అధికారి, సిబ్బంది తమ పోలీస్ స్టేషన్‌ను పరిశుభ్రంగా, పచ్చదనంతో, క్రమశిక్షణతో నిర్వహించడం తమ బాధ్యతగా భావించి పనిచేయాలని సూచించారు.

## ఓటర్లు అందరూ నమోదు చేసుకోవాలి



**కలెక్టర్ ప్రతిమా సింగ్**

**ముద్ర ప్రతినిధి, మెదక్:** అర్హత గల ఓటర్లు అందరూ సర్ లో నమోదు చేసుకోవాలని కలెక్టర్ ప్రతిమా సింగ్ తెలిపారు. ఓటర్ ప్రత్యేక సవరణ గడువును ఈనెల 10 వరకు ఎన్నికల సంఘం పొడిగించిందని గుర్తు చేశారు. సవరించిన సర్ షెడ్యూల్ ప్రకారం ఎన్యూమరేషన్ ఫారాలు ఈనెల 10నసమర్పించాలని, అదే రోజు పోలింగ్ కేంద్రాల హేతుబద్ధీకరణ, పునర్వ్యవస్థీకరణ 17న ముసాయిదా ఓటరు జాబితాల ప్రచురణ, ఈనెల 17 నుండి సెప్టెంబర్ 16 వరకు క్లెయిమ్‌లు, అభ్యంతరాల స్వీకరణ, సెప్టెంబర్ 17 నుండి అక్టోబర్ 16 వరకు క్లెయిమ్‌లు, అభ్యంతరాల పరిష్కారం అక్టోబర్ 19న తుది ఓటరు జాబితాల ఉంటుందన్నారు.

## ప్రైవేట్ స్కూల్ బస్సుకు తప్పిన ప్రమాదం




**ముద్ర ప్రతినిధి, మెదక్:** మెదక్ పట్టణ సమీపంలోని పుష్పాల వాగు వద్ద ప్రైవేట్ పాఠశాల బస్సు బురదలో చిక్కుకుంది. అదృష్టవశాత్తు బస్సు వాగులో పడకపోవడంతో విద్యార్థులకు పెను ప్రమాదం తప్పింది. గతేడాది వరదలకు వంతెన కొట్టుకుపోగా మట్టి పోసి తాత్కాలికంగా రాకపోకలు పునరుద్ధరించారు. కొద్ది రోజులుగా కురుస్తున్న వర్షాలతో మార్గం బురదమయంగా మారడంతో బస్సు బురదలో ఆగిపోయింది. విద్యార్థులు రోడ్డుపైనే నిరీక్షించాల్సిన పరిస్థితి ఏర్పడింది. సమాచారం అందుకున్న విద్యార్థుల తండ్రులు, కుటుంబ సభ్యులు అక్కడికి చేరుకొని తమ పిల్లలను తీసుకెళ్లారు. పుష్పల వాగు బ్రిడ్జి వద్ద పటిష్టమైన రోడ్డు వేయాలని కోరుతున్నారు. ఈ బ్రిడ్జి మీదుగా అనేక గ్రామాల ప్రజలు రాకపోకలు సాగిస్తారు.

## అప్పుడే పుట్టిన శిశువుకు ముర్రుపాలే అమృతం




**డాక్టర్ మహేష్ రెడ్డి**

**ముద్ర ప్రతినిధి, సిద్దిపేట :** అప్పుడే పుట్టిన పిల్లలకు ముర్రుపాలు తాగించడం ఎంతో శ్రేయస్కరమని ప్రముఖ చిన్న పిల్లల వైద్యులు డాక్టర్ మహేష్ రెడ్డి అన్నారు. సిద్దిపేట ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ప్రముఖ చిన్న పిల్లల వైద్యులు, శిశు రక్ష చిల్డ్రన్ ఆసుపత్రి చైర్మన్ డాక్టర్ మహేష్ రెడ్డి ఆయన మాట్లాడారు. నేటి నుండి వారం రోజులపాటు తల్లిపాలపై పలు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. చిన్నపిల్లలకు డబ్బాపాలకంటే తల్లిపాలు ఇవ్వడం ద్వారా వారిలో ఇమ్యూనిటీ పవర్ పెరుగుతుందని తెలిపారు. తల్లిపాల ప్రాముఖ్యతపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు 1992 నుండి ఆగస్టు మొదటి వారాన్ని తల్లిపాల వారోత్సవాలుగా జరుపుతున్నారని తెలిపారు. అందులో భాగంగానే ఈ వారంలో తల్లిపాల వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా పట్టణంలోని పాఠశాలల్లో తల్లిపాల వినియోగంపై అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తామని తెలిపారు. ప్రతి ఒక్కరు పిల్లలకు తల్లిపాలు మాత్రమే ఇవ్వాలని సూచించారు.

Printed, Published and owned by Aliminati Indra Reddy Printed at M/s. Kakatiya Printers, 2-24-96/6, Plot No. 26 & 27, L.N. Colony, New IDA, Uppal, Hyderabad500039, Medchal Malkajgiri Dist., Telangana and Published from H.No.7-32/B, Flat No. 202, Sri Sai Heights, Sri Sai Nagar, Street No. 8, Hasbiguda, Medchal Malkajgiri District, Hyderabad 500007, Editor: Y Narender Reddy, RNI. Reg.No.TELTEL/2013/50413. e mail: mudradaily@gmail.com, Cell 9949193555